రైతు సంక్షేమమే లక్ష్యం : పరకాల PACS బృందం క్షేత్ర పర్యటన




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

కల్లూరులో విద్యా వారోత్సవాలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 134 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 11 మే 2026






# విజయ్ అను నేను..

## - తమిళనాడు సిఎంగా ప్రమాణ స్వీకారం

● తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం ● రాహుల్ గాంధీ, పలువురు ప్రముఖులు హాజరు ● ఉచిత విద్యుత్‌కు తొలి సంతకం

**చెన్నై,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా తమిళ వ్రెటి కజగం (టివికె) అధినేత జోసెఫ్ విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఆదివారం ఉదయం పది గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్.. విజయ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. విజయ్ ప్రమాణస్వీకారాన్ని మొదలు పెట్టగానే ఆయన అభిమానులు, టివికె కార్యకర్తలు, మద్దతుదారులు ఒక్కసారిగా కేరింతలు, చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయ్‌తో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, విజయ్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. టివికె కార్యకర్తలు, విజయ్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలి రావడంతో ఇండోర్ స్టేడియంలో పండుగ వాతావరణం కనిపించింది. **ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం** సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ మూడు ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. ఉచిత విద్యుత్ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. ఈ మేరకు ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందనుంది. మిగతా2లో...

# పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించండి

## - ప్రధాని నరేంద్ర మోడీ



**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ పర్యటనలో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ దేశ ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఇంధన వినియోగం, విదేశీ మారక ద్రవ్యం ఆదా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించండి అంటూ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో, దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా పెట్రోల్, డీజిల్‌ను పరిమితంగా వినియోగించాలని ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సొంత వాహనాల కంటే వీలైనంత వరకు మెట్రో రైళ్లు, బస్సులు వంటి ప్రజారవాణా వ్యవస్థలను ఉపయోగించాలని సూచించారు. పర్యావరణ హితమైన, పొదుపైన ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మళ్లాలని కోరారు. సాధ్యమైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలన్నారు. ఆఫీసులకు వెళ్లడం తగ్గించి, వీలైనంత వరకు 'వర్క్‌ఫ్రమ్ హోమ్', 'ఆన్‌లైన్ మీటింగ్‌లు' నిర్వహించుకోవాలని సూచించారు. ఇది ఇంధన ఆదాకు ఎంతగానో మిగతా2లో...

# పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇళ్లకు ప్రధాని మోదీ..





**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని మోడీ ఎన్‌డిఎ మిత్రపక్షాలను మచ్చిక చేసుకుంటున్నారు. అందుకోసం ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు. అధికారిక పర్యటనల్లో కూడా సహజశైలికి భిన్నంగా వ్యవహరిస్తూ నేతల ఇళ్లకు వెళ్లి మరీ ప్రసన్నం చేసుకుంటున్నారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ... అధికారిక కార్యక్రమాల అనంతరం హైటెక్ సిటీ సమీపంలో తన కార్పొరేట్ మిత్రుడి ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా2లో...

# అభివృద్ధిపై అందరం దృష్టి పెట్టాలి

## - సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణను నెంబరు వన్ చేయడమే తమ లక్ష్యమని.. తెలంగాణ అభివృద్ధికి మోడీ సహకారం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.పీఎం మోడీ హైదరాబాద్ ఆదివారం హెచ్‌ఐసీసీలో ఏర్పాటు చేసిన సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు ప్రధాని మోడీ.ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..

మిగతా2లో...

# రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

● ఏపీ తీరంపై వాతావరణ మార్పులు... రెండు రోజుల్లో అల్పపీడనం
● నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం
● మన్నార్ గల్ఫ్ వద్ద కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
● ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం వరకు విస్తరించిన వాతావరణ ద్రోణి



**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అమరావతి వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మన్నార్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనే ఈ అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, మధ్య, ఎగువ స్థాయి పశ్చిమ గాలుల్లో కొనసాగుతున్న ద్రోణి కోస్తాంధ్రపై ప్రభావం చూపుతోంది. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి... ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య భాగాల వరకు విస్తరించి ఉంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# ఈ ఏడాది యధావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

● పాఠశాల విద్యపై శాసనసభలో చర్చించాకే నిర్ణయం : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ ఏడాది యధావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనంపై ఆయన ఆదివారం సంబంధిత అధికారులతో సమీక్ష?ంచారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, విలీన ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకూడదని పాత పద్ధతిలో అడ్మిషన్లు చేపట్టాలని సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో తరహాలో 11, 12 తరగతులు నిర్వహించాలనీ, ఫలితంగా

మిగతా2లో...




## హార్మ్ముజ్ ప్రతిపాదనపై అనిశ్చితి

- ఇరాన్ స్పందన కోసం అమెరికా నిరీక్షణ
- పశ్చిమ ఆసియా శాంతి చర్చలు ముమ్మరం
- అమెరికా, ఇరాన్ ఘర్షణ చాలా క్లిష్టమైనది
- అణ్వాయుధాల కోసం టెహ్రాన్ ప్రయత్నిస్తున్నట్టు ఆధారాలు లేవు: పుతిన్




## తెలంగాణలో రాజకీయ మార్పునకు నాంది: రాంచంద్రరావు

# విజయ్ అను నేను..

(మొదటి పేజీ తరువాయి)

యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్షణకు 'సింగప్పన్' ర్యాపిడ్ రెస్పాన్స్ ఫోర్స్ ఫైళ్లపై కూడా విజయ్ సంతకాలు పెట్టారు. ఈ సందర్భంగా విజయ్ ఎంతో భావోద్వేగంతో ప్రసంగించారు. **గుర్తుంచుకోండి.. ఒక్క పైసా తినను** విజయ్ తన ప్రసంగంలో పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తమిళనాడులో ప్రజాప్రభుత్వం వచ్చిందని చెప్పారు. సామాజిక, లౌకిక, న్యాయశకం మొదలైందని తెలిపారు. డైరెక్టర్ కుమారుడు నేడు సిఎం అయ్యాడనీ, తాను ఎన్నో కష్టాలు అధిగమించి ఈ స్థాయికి వచ్చానని విజయ్ చెప్పారు. తనను ఎంతో మంది ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టారనీ, హామీల అమలుకు కొంత సమయం ఇవ్వాలని విజయ్ ఈ సందర్భంగా కోరారు. "గుర్తుంచుకోండి.. విజయ్ ఒక్క పైసా కూడా ప్రభుత్వ సొమ్ము తినడు. నాకు ఆ అవసరం లేదు. నేను తప్పు చేయను. నా చుట్టూ ఉన్నవారిని చేయని వ్వను" అని అన్నారు. విద్యార్థుల కోసం విజయ్ మామ అన్నీ మంచి పనులే చేస్తాడని ఆయన హామీ ఇచ్చారు. ఒక్కటే పవర్ సెంటర్ అని, అది విజయ్ అని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. **ప్రధాని సహా పలువురు శుభాకాంక్షలు** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టివికె అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ కు ప్రధాని నరేంద్రమోడీసహా పలువురు నేతలు అభినందనలు తెలిపారు. విజయ్ పరిపాలన అద్భుతంగా సాగాలని, కేంద్ర ప్రబుత్వం తరపున పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని ఎక్స్ లో పేర్కొన్నారు. **సిపిఎం అభినందనలు** సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబి ఆదివారం ఎక్స్ వేదికగా సిఎం విజయ్ కు అభినందనలు తెలిపారు. "తమిళనాడు ముఖ్యమ ంత్రిగా బాధ్యతలు చేపట్టిన తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు తిరు సి. జోసెఫ్ విజయ్ కు అభినందనలు. లౌకికవాదం, ప్రజా సంక్షేమం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం సూత్రాలను నిలబెడుతుందని, తమిళనాడు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశిస్తూ.. మీకు, మీ ప్రభుత్వానికి శు భాకాంక్షలు " అని పేర్కొన్నారు. **ప్రారంభంలో 'తమిళ మాతృవందనం' సాంప్రదాయం కొనసాగుతుంది: మంత్రి ఆధవ్ అర్జున** తమిళనాడులో, 'తమిళ తాయ్ వాళ్తు'ను మూడవ గీతంగా ఆలపించడం టివికె నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి ఆమోదయోగ్యం కాదని మంత్రి అధవ్ అర్జున్ పేర్కొన్నారు. ప్రారంభంలో తమిళ తాయ్ వాళ్తు పాడాలని గవర్నర్ కార్యాలయాన్ని కోరామని, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఒక కొత్త సర్క్యులర్ ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని తమకు తెలియజేశారని తెలిపారు. అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో 'తమిళ తాయ్ వాళ్తు' (తమిళ మాతృ వందనం), చివరలో జాతీయ గీతం ఆలపించే సంప్రదాయాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందని తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున ఆదివారం ఎక్స్ లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని మంత్రివర్గ ప్రమాణ స్వీకారంలో మొదట 'వందేమాతరం', ఆ తర్వాత జాతీయ గీతం, చివరగా 'తమిళ తాయ్ వాళ్తు' ఆలపించిన నేపథ్యంలో మంత్రి ఆధవ్ అర్జున ఈ ప్రకటన చేశారు. **టీవీకే మంత్రులు :** ఎన్. ఆనంద్ (టి. నగర్ నియోజకవర్గం) ఆధవ్ అర్జున (విల్లివాక్కం) కె.జి. అరుణ్‌రాజ్ (తిరుచెంగోడు) కె.ఎ. సెంగోట్టయన్ (గోబిచెట్టిపాళయం) పి. వెంకటర మణన్ (మైలాపూర్) సి.టి.ఆర్. నిర్మల్‌కుమార్ (తిరుప్పరంకుంద్రం) ఎ. రాజ్మోహన్ (ఎగ్మోర్) టి.కె. ప్రభు (కరైకుడి) ఎస్. కీర్తన (శివకాశి)

# ఈ ఏడాది యధావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గుతాయని తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. 'సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చది విన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీ డియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొం దన్నారు. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పాత పద్ధతిలోనే కొనసాగాలని సర్కార్ నిర్ణయించిందని సీఎం తెలిపారు. విలీనంతో ముడిపడిన సాంకేతిక సమస్యలను అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణా పాల్గొన్నారు.

# హార్ముజ్ ప్రతిపాదనపై అనిశ్చితి

**టెహ్రాన్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమ ఆసియాలో రెండు నెలలకు పైగా కొనసాగుతున్న సంఘర్షణను ముగించేందుకు జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. శనివారం హార్ముజ్ జలసంధి పరిసరాల్లో ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గిన సంకేతాలు కనిపించాయి. ఈ సంఘర్షణను అంతం చేసే లక్ష్యంతో అమెరికా ముందుకు తెచ్చిన కొత్త శాంతి ప్రతిపాదనపై ఇరాన్ స్పందన కోసం అంతర్జాతీయ సమాజం ఇప్పుడు నిశితంగా గమనిస్తోంది. వాషింగ్టన్ ప్రతిపాదనకు ఇరాన్ త్వరలోనే స్పందిస్తుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, టెహ్రాన్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. ఈలోగా, పశ్చిమ ఆసియాలో ప్రాంతీయ భద్రత, దీర్ఘకాలిక స్థిరత్వంపై చర్చించేం దుకు రూబియో మయామిలో మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్ థానీతో సమావేశమయ్యారు. ఒక ముఖ్యమైన పరిణామంలో, ఖతార్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్తున్న ఒక ఎల్‌పిజి గ్యాస్ ట్యాంకర్ శనివారం హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించింది. సంఘర్ష ణ ప్రారంభమైనప్పటి నుంచి ఇలా జరగడం ఇదే మొదటిసారి. మధ్యవర్తిత్వ ప్రయత్నాల్లో పాలుపంచు కుంటున్న దేశాలతో విశ్వాసాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగానే ఇరాన్ ఈ ప్రయాణానికి అనుమతి ఇచ్చిందని నివేదికలు సూచిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరియు ఇంధన మార్కెట్లపై దీని ప్రభావం పెరుగుతున్నందున, ఈ సంఘర్షణను ముగించాలని అన్ని పక్షాలపై ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతోంది. శాంతి చర్చలు కొనసాగుతున్నప్పటికీ, ఈ ప్రాంతంలో చెదురుమదురు ఘర్షణలు జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. ఇరాన్ ఓడరేవులోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న రెండు నౌకలను అమెరికా యుద్ధ విమానాలు అడ్డగించి వెనక్కి పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, శుక్రవారం ఇరాన్ నుండి ప్రయోగించిన క్షిపణులు , డ్రోన్‌లను తాము అడ్డుకున్నామని, ఈ దాడిలో ముగ్గురు గాయపడ్డారని యూఏఈ పేర్కొంది. **అమెరికా నౌకలపై క్షిపణులు గురిపెట్టాం దాడులు చేస్తే తీవ్ర ప్రతీకారం : ఐఆర్‌జీసీ వార్నింగ్** ఇరాన్ చమురు ట్యాంకర్లు, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడి జరిగినా పశ్చిమాసియా అమెరికా స్థావరాలపై, శత్రు నౌకలపై భారీ ప్రతిదాడి ఉంటుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్ జీసీ) నావికాదళం హెచ్చరించింది. శుక్రవారం రెండు ఇరాన్ చమురుట్యాంకర్లపై అమెరికా దాడి చేసిన నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ టీవీ ద్వారా నౌకాదళం ఈ హెచ్చరిక చేసింది. అయితే ఇరాన్ ఓడరేవుల వద్ద తాము విధించిన దిగ్బంధనాన్ని ఉల్లం ఘించేందుకు యత్నించిన రెండు ఇరాన్ ట్యాంకర్లను శుక్రవారం నిలిపివేసినట్టు అమెరికా సైన్యం తెలిపింది. దానికి కొన్నిగంటల ముందు మూడు యుద్ధనౌకలపై దాడులను తిప్పికొట్టామని పేర్కొంది. జలసంధిలోని ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు చేశామని అమెరికా సైన్యం వెల్లడించింది. యుద్ధం ముగించడానికి అమెరికా చేసిన ప్రతిపాదనలపై ఇరాన్ స్పందన కోసం ట్రంప్ సర్కార్ ఎదురుచూస్తోంది. హార్ము జ్ జలసంధిని తెరవాలని టెహ్రాన్ అణు కార్యక్రమం నిలిపివేయాలనే అంశాలపై టెహ్రాన్‌కు అమెరికా కొన్ని ప్రతిపాదనలు చేసింది. వీటిపై ఇరాన్ ఇంకా అధికారికంగా స్పందించలేదు. మరోవైపు సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని త్వరలోనే ప్రజల ముందుకు వస్తారని ఇరాన్ ఉన్నతాధికారి చెప్పారు. యుద్ధం ప్రారంభంలో జరిగిన దాడుల్లో మొజ్తబా మోకాలు, వెన్నుకు గాయాలు అయ్యాయని అవి చాలావరకు నయమయ్యాయని తెలిపారు

# నాపై దుష్ప్రచారం చేస్తున్నారు..
# వేదికపై కంటతడి పెట్టిన బండి సంజయ్

**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** జై శ్రీరామ్ నినాదంతోనే గడీలను బద్దలుకొట్టామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. జై శ్రీరామ్ నినాదంతోనే పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చామని, అదే నినాదంతో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై మాట్లాడుతూ.. తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారంటూ కంటతడిపెట్టుకున్నారు. తాము సనాతన ధర్మం కోసం పనిచేస్తున్నామని అన్నారు. తమ ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. బండి సంజయ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'జై శ్రీరామ్ అంటే కడుపు నిండుతుందా అని కొందరు అన్నారు. జై శ్రీరామ్ నినాదమే మాలో పోరాటపటిమ నింపింది. జై శ్రీరామ్ అంటే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారు. పార్టీకి తలవంపులు తెచ్చే పనులు నేను చేయను. రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. భయపడడానికి నేను



ఫామ్‌హౌస్‌లోని ఎలుకను కాను. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు ఏమయ్యాయి?'..'రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. బీజేపీ నేతలు భేదాభిప్రాయాలు వీడాలి. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పోరాడాలి. మోదీ లేనిదే తెలంగాణలో ప్రభుత్వం నడవదు. బెంగాల్‌లో బీజేపీకి గెలుపు అంత సులభంగా రాలేదు. 300 మంది బీజేపీ కార్యకర్తలు బలిదానం చేశారు. కేరళలోనూ బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. నిధులు ఇచ్చేది మనం.. అభివృద్ధి చేసేదీ మనమే' అని అన్నారు.

# పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించండి

(మొదటి పేజీ తరువాయి)

తోడ్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మోడీ నొక్కి చెప్పారు. ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరిగాయని, దేశ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని కనీసం ఏడాది పాటు ప్రజలు బంగారం కొనడం ఆపివేయాలని కోరారు. గతంలో యుద్ధ సమయాల్లో దేశం కోసం ప్రజలు బంగారం దానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అలాగే దేశంలో రాగి (జశీజూజూవతీ) కొరత తీవ్రంగా ఉందని, వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. క్లిష్ట పరిస్థితుల్లో మధ్యతరగతి ప్రజలు తమ ఖర్చులను నియంత్రించుకోవాలని ప్రధాని కోరారు. ఆడంబరాలు వద్దని, అనవసరమైన దుబారా ఖర్చులు, ఆడంబరాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇళ్లకు ప్రధాని మోదీ..

(మొదటి పేజీ తరువాయి)

నాయుడు నివాసానికి వెళ్లారు. ప్రధాన ద్వారం వద్ద చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్డ మోడీకి సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు కుటుంబ సభ్యులను పలకరించి కుశల ప్రశ్నలు అడిగిన మోడీడ చంద్రబాబుతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం ఇరువురు సుమారు గంటకుపైగా పలు అంశాలపై చర్చించుకున్నారు. ఎన్నికల్లో ఎన్‌డిఎ మిత్రపక్షాల సహకారం, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అనుసరించిన రాజకీయ వ్యూహాలను మోడీ చంద్రబాబు వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. తమిళనాడులో విజయ్ పార్టీకి వచ్చిన ప్రజాదరణపై కూడా చర్చ జరిగింది. ప్రధానంగా దక్షిణాదిలో ఎన్‌డిఎ బలం పెంచుకోవడంతోపాటు స్వతంత్రంగా ఉన్న ప్రాంతీయ పార్టీలకు ఏవిధంగా గాలం వేయాలనే దానిపై కూడా ఇరువురు సమాలోచనలు చేసినట్లు సమాచారం. తెలంగాణలో టిడిపి బలం గతంలో కంటే మెరుగుపడిందని, తెలంగాణలో బిజెపికి ప్రజాదారణ పెరుగుతోందని, ఇకపై తెలంగాణపై దృష్టి కేంద్రీకరిస్తామని, అందుకు సహకరించాలని చంద్రబాబుని మోడీ కోరినట్టు తెలిసింది. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తిరుగులేని ప్రజాదరణ పొంది ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందంటూ మోడీకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలను మోడీకి వివరించారు. కీలక ప్రాజెక్టులపై మాట్లాడేందుకు త్వరలో ఢిల్లీ వస్తానని తెలిపారు.అంతకు ముందు జూబ్లీహిల్స్‌లోని ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ఇంటికి మోడీ వెళ్లారు. ఆయనకు పవన్ కల్యాణ్, ఆయన కుటుంబసభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్‌తో భేటీ అయిన మోడీ.. పవన్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. సైనస్ సమస్య కారణంగా మైకోసర్జరీ జరిగిందని, వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నానని పవన్ తెలిపారు. తమపై అభిమానంతో ఇంటికి వచ్చినందుకు మోడీకి పవన్ కల్యాణ్ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే మళ్లీ కలుద్దామని చెప్పిన మోడీ అక్కడ నుంచి చంద్రబాబు ఇంటికి వెళ్లారు. అనంతరం ప్రధాని అక్కడ నుంచి నేరుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు బయల్దేరి చేరుకున్నారు. మోడీ పర్యటన నేపథ్యంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అభివృద్ధిపై అందరం దృష్టి పెట్టాలి: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిపై అందరం దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే తెలంగాణ కూడా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రధాని మోడీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయడమే తన లక్ష్యమని అన్నారు. తెలంగాణ విజ్ఞప్తులను మోడీ వెంటనే పరిష్కరించాలని కోరారు.

# తెలంగాణలో రాజకీయ మార్పునకు నాంది: రాంచంద్రరావు

**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ప్రజల ఉత్సాహం తెలంగాణలో రాజకీయ మార్పునకు నాంది పలుకుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో ఉన్న ప్రజలకంటే రెట్టింపు సంఖ్యలో ప్రజలు బయట ఉన్నారని, ఇది ప్రజల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చిన ప్రధానికి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అద్భుత స్వాగతానికి కొనియాడారు.ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలన నుంచి భారతదేశంలో విలీనమైన చారిత్రాత్మకమైన సెప్టెంబర్ 17నే మోడీ జన్మదినం కూడా కావడం తెలంగాణ ప్రజలకు మరింత గొప్ప భావోద్వేగ అనుబంధాన్ని కలిగిస్తోందని రాంచంద్రరావు పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశ అభివృద్ధికి దోహదపడే రూ.9,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోడీ దేశానికి అంకితం చేయడం పట్ల భారతీయ జనతా పార్టీ తెలంగాణ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న పోరాటం జాతిని విభజించే శక్తులపై పోరాటమని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు దేశాన్ని నక్సలిజం, లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం వంటి శక్తులు భయపెట్టాయని, కానీ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం నక్సలైట్ ముక్త్ భారత్, లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం ముక్త్ భారత్ దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దీనికి పూర్తి ఘనత ప్రధాని మోడీకే చెందుతుందని అన్నారు. దక్షిణాది -ఉత్తరాది పేరుతో దేశాన్ని విభజించే రాజకీయ శక్తులతో పాటు కుటుంబ పాలన పేరుతో దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ వంటి పార్టీలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.

# రేపు కెసిఆర్ అధ్యక్షతన కీలక సమావేశం

**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అధ్యక్షతన ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవెల్లి నివాసంలో కీలక సమావేశం జరగనున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలిపక్షాల ఉప నాయకులు పాల్గొనే ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, పార్టీ ఇంఛార్జిల నియామకం సహా పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నారు.

# అవినీతి అక్రమాలకు తెలంగాణ అడ్డాగా మారింది: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్,మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్, అంతకు ముందు పాలించిన బిఆర్ఎస్‌ల పాలనలో తెలంగాణ అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. పరేడ్‌గ్రౌండ్ సభలో ఆయన ప్రసంగిస్తూ.. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడ్డారు. గత ఎన్నికల్లో ఎనిమిది లోక్‌సభ, రెండు ఎమ్మెల్సీలు గెలిచామని చెబుతూ రానున్న ఎన్నికల నాటికి బిజెపి జెండా తెలంగాణలో ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ కుటుంబ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రెండున్నరేళ్ల రేవంత్ పాలనలో తెలంగాణ తల్లి విలవిల్లాడిందని ఆవేదన వ్యక్తం చేశారు.బిజెపి ఏదైనా హామీ ఇస్తే అమలు చేసి చూపిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ముస్లిం, ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడో చెప్పారని అన్నారు. కాంగ్రెస్‌లో అసలు హిందూయిజమే లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్రం పాత్ర ఎంతో ఉందన్న ఆయన హైస్పీడ్ రైళ్ల నుంచి ఎన్నో రంగాల్లో కేంద్రం లక్షల కోట్ల నిధులు ఇవ్వడం వల్ల అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఇంకా సన్నబియ్యం సరఫరాలో 80 శాతం కేంద్ర నిధులు ఉన్నాయని గుర్తు చేశారు.

# ధర్మారం – సీతారాంపురం రహదారి పనుల్లో నిర్లక్ష్యం

## - దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు కాంట్రాక్టర్ల తీరుపై తీవ్ర ఆగ్రహం

**(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ధర్మారం నుండి సీతారాంపురం వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు ప్రజలకు సౌకర్యం కల్పించాల్సింది పోయి ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నాయి. రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో దుమ్ము, ధూళి ఎగిసిపడి బాటసారులు, వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రహదారిపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము మేఘాల్లా ఎగసిపడుతూ ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు అత్యంత ఇబ్బందులు పడుతున్నారు.రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు నీళ్ల చల్లకపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం పూర్తిగా నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా పనులు కొనసాగించడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము కారణంగా శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు, కళ్ల మంటలు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.గ్రామాల మధ్య ప్రధాన రహదారిగా ఉపయోగించే ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణిస్తుంటారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పనులు త్వరగా పూర్తి చేయాలనే పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి రహదారి పనుల వద్ద నిరంతరం నీళ్లు చల్లేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి పనులు ప్రజల సౌకర్యం కోసం చేయాలి గానీ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా కాకూడదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరుతున్నారు.

# గాంధీభవన్ చక్ర హరి బాలరాజుకు కాంగ్రెస్ గౌరవం.. భట్రాజ్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియామకం


**భట్రాజ్ సమాజానికి గర్వకారణంగా చక్ర హరి బాలరాజ్ నియామకం**

**పార్టీ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడికి దక్కిన అత్యున్నత గుర్తింపు**

**గాంధీభవన్ బాలరాజ్ పేరు చెబితే రాష్ట్ర నాయకులందరికీ తెలిసిన నిబద్ధత గల కాంగ్రెస్ సైనికుడు**

**కష్టసుఖాల్లో కాంగ్రెస్ జెండాను వదల్లేని కార్యకర్తకు దక్కిన గౌరవప్రదమైన పదవి**

**గాంధీభవన్ నుంచి రాష్ట్ర స్థాయి గుర్తింపువరకు.. చక్ర హరి బాలరాజ్ సేవలకు కాంగ్రెస్ పెద్దల ప్రశంసలు**





**హైదరాబాద్ మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీ కష్టసుఖాల్లో అండగా నిలిచిన గాంధీభవన్ చక్ర హరి బాలరాజుకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని అందించిందని తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ రాష్ట్ర కో–కన్వీనర్ ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ భట్రాజ్ సమాజానికి గర్వకారణంగా చక్ర హరి బాలరాజ్ నియామకమన్నారు. కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌గా చక్ర హరి బాలరాజును నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని జీవితాంతం పార్టీ సిద్ధాంతాలకే కట్టుబడి పనిచేసిన నాయకుడు చక్ర హరి బాలరాజ్ అని, గాంధీభవన్ చక్ర హరి బాలరాజ్ అనే పేరు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని కీర్తి సంతోష్ రాజ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మాత్రమే కాకుండా ఇతర పార్టీల నాయకులు కూడా చక్ర హరి బాలరాజ్ పేరు చెబితే ముందుగా గాంధీభవన్ బాలరాజ్ అనే పేరే గుర్తుకు వస్తుందని అన్నారు.పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా క్రమశిక్షణతో, నిష్ఠతో పూర్తి చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి బాలరాజ్ అని కొనియాడారు. కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు చక్ర హరి బాలరాజును గుర్తుపట్టని కాంగ్రెస్ నాయకుడు లేరని పేర్కొన్నారు. ఇలాంటి అంకితభావం గల నాయకుడిని గుర్తించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆశీర్వాదాలతో భట్రాజ్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించడం భట్టరాజ్ సమాజానికి గర్వకారణమని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని విశ్వసించి పార్టీ కోసం కష్టపడిన వారిని కాంగ్రెస్ ఎప్పటికీ మర్చిపోదని, బాలరాజ్ నియామకం అందుకు నిదర్శనమని ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా యావత్ భట్రాజ్ సంఘం తరపున సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భట్రాజు సంఘం రాష్ట్ర నాయకులు సమిదెశి ముత్యాలరాజు, అంబటి బాపిరాజు, జొన్నలగడ్డ మూర్తి రాజు, బిరుద రాజు వెంకట్ రాజు పాల్గొన్నారు.

# “అమ్మ ప్రేమలా... రక్తదానం జీవదానం”






**తలసేమియా చిన్నారుల కోసం కదిలిన ‘ఖమ్మం‘ మానవత్వం..!**

**మాతృదినోత్సవం వేళ ప్రాణదాతలుగా మారిన 50 మంది ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నడక సాధకులు**



**ఖమ్మం ప్రతినిధి, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అమ్మ అంటే ఇచ్చేది.. ప్రాణం పోసేది. తొమ్మిది నెలలు రక్తాన్నే పాలగా మార్చి బిడ్డకు జన్మనిచ్చే ఆ తల్లి ప్రేమను స్మరించుకుంటూ, నిరుపేద తలసేమియా చిన్నారుల పాలిట తాము కూడా ‘అమ్మ‘లమే అని నిరూపించారు ఖమ్మం నగర వాకర్స్. అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లోని నడక సాధకుల కమిటీ ఆధ్వర్యంలో ఒక గొప్ప మానవీయ యజ్ఞం జరిగింది. కేవలం నడకతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా, మాతృమూర్తుల త్యాగానికి చిహ్నంగా, రక్తం కరువై కొట్టుమిట్టాడుతున్న నిరుపేద చిన్నారులకు తమ రక్తాన్ని అందించి ప్రాణదానం చేయాలన్న సంకల్పంతో 50 మంది సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని పంపారు. ఈ సందర్భంగా రాకం శ్యామ్ బాబు తదితరులు మాట్లాడుతూ... “అమ్మ గర్భంలో ప్రాణం పోస్తుందిడ రక్తదాతలు మరోసారి ఆ ప్రాణాన్ని నిలబెడతారు” అని భావోద్వేగంగా అన్నారు. “ఒక యూనిట్ రక్తండ ఒక చిన్నారి జీవితానికి కొత్త ఊపిరిని“ అందించిన వారవుతున్నారన్నారు. తలసేమియా చిన్నారులకు ప్రతి నెలా రక్తం అవసరం అవుతుందని, అలాంటి పిల్లల కోసం ముందుకు వచ్చి రక్తదానం చేయడం నిజమైన మానవసేవ అని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా అనేక మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, యువత ఎక్కువగా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంకల్ప సంస్థ సభ్యులు రవి, డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రాంబాబు పాల్గొని రక్తదాతలను అభినందించారు. అలాగే వాకర్స్ కమిటీ సభ్యులు రామనాథం, రాకం శ్యామ్‌బాబు, విజయ్, వెంకట్, మురళీ, నరసింహారావు, రామశేఖరం, గోవర్ధన్, జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబు లు సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. యూనిటీ ఇన్ డైవర్సిటీ సభ్యులు కత్తి నెహ్రూ, విడిఐ జయరాజ్, డాక్టర్ జాఫర్, గిరి, సైదారావు తదితరులు రక్తదాతలకు పండ్లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు.



# రైతు సంక్షేమమే లక్ష్యం : పరకాల PACS బృందం క్షేత్ర పర్యటన



**పరకాల, మే10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (PACS) పరకాల బృందం ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుంది. సంఘం అధ్యక్షులు గుండెబోయిన నాగయ్య యాదవ్, ఉపాధ్యక్షులు చందుపట్ల రాజేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పంచగిరి శ్రీనివాస్ కలిసి పలు ప్రాంతాల్లోని ధాన్యపు రాశులను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎరువులు మరియు రుణాల అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. సహకార సంఘం ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తుందని, అవసరమైన రుణ సదుపాయాలు మరియు ఎరువుల పంపిణీని సకాలంలో అందిస్తున్నామని అధ్యక్షులు నాగయ్య యాదవ్ తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే PACS ప్రధాన ధ్యేయమని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా వనం వారి ఆత్మీయ సమ్మేళనం






**హైదరాబాద్, మే 10(పిసిడబ్ల్యూ న్యూస్):** హయత్ నగర్ లోని ధనంజయ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఆదివారం వనం కుటుంబీకుల వనం వారి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం అంగరంగ వైభవంగా కన్నుల పండగ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వనం కుటుంబీకులు కుల బంధవులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకొని పరిచయాలు చేసుకొని వారి అభిమానాన్ని ఆత్మీయతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేతకు సంబంధించి మహిళలు పురుషులు హ్యాండ్లూమ్ వాక్ లో పాల్గొనడం జరిగింది. ముఖ్యంగా మాతృ దినోత్సవ సందర్భంగా మాతృమూర్తులు అందరికీ సత్కరించుకోవడం జరిగింది. రాబోవు ఫాదర్స్ డే ను పురస్కరించుకొని తండ్రులందరినీ సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్కీ డిప్ విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను అందజేయడం జరిగింది. వనం వారందరూ జాతీయ గీతాలు భక్తిశ్రద్ధలతో ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వనం జయశ్రీ, వనం శ్రీ సరిత, వ్యాఖ్యతలుగా వ్యవహరించడం జరిగింది. వనం సుమన్, వనం విశ్వనాథం, వనం దుశ్యాంతల, వనం జయరాజ్, వనం పద్మనాభం, వనం మహేష్, వనం వంశీకృష్ణ, వనం యాదగిరి, వనం చంద్రమౌళి, వనం శ్రీనివాస్, వనం సిరివెన్నెల, వనం నర్మదా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# కల్లూరులో విద్యా వారోత్సవాలు

- **11 నుంచి 17 వరకు విభిన్న కార్యక్రమాలు**
- **మండల విద్యాశాఖ అధికారిని పత్తిపాటి నివేదిత**



**కల్లూరు, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు ప్రభుత్వ హై స్కూల్‌లో ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల11వ తేదీన పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, లాబొరేటరీలు, మరుగుదొడ్ల ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. 11 నుండి 25 వరకు కోడింగ్, యోగా, క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. 12న సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 13వ తేదీన సర్పంచులు, ప్రజాప్రతినిధులతో విద్యాభివృద్ధిపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న జయశంకర్ బడిబాట, పిటిఎం, ఇంటింటి నమోదు, తల్లిదండ్రుల సమావేశాలు, మిడ్‌డే మీల్ వంటల పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 15న పుస్తక ప్రదర్శన, డిజిటల్ కార్యక్రమాలు, బుక్ టాక్స్ ప్రారంభం కానున్నాయి. 16న కళా విభాగం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, లంబాడీ నృత్యం వంటి వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 17న విద్య విజయోత్సవం సందర్భంగా ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులకు సన్మానాలు చేయనున్నట్లు తెలిపారు.అదనంగా, కల్లూరు మండలంలోని విద్యార్థులందరికీ ప్రభుత్వ హై స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయని, పాల్గొనే విద్యార్థులకు స్నాక్స్ అందించబడతాయని చెప్పారు.ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు హాజరై విద్యార్థులను ప్రోత్సహించి విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## ప్రధాని మోదీ సభకు భారీ ఎత్తున తరలివెళ్లిన

# కరీంనగర్ జిల్లా బిజెపి శ్రేణులు...

### వాహనశ్రేణిని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...




**కరీంనగర్ జిల్లా మే 10(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో ఆదివారం నిర్వహించిన ప్రధాని మోదీ సభ (జనాగ్రహ సభ) కోసం కరీంనగర్ జిల్లా నుండి భారీ ఎత్తున బిజెపి శ్రేణులు తరలి వెళ్లారు. కరీంనగర్ నుండి సభ కోసం తరలి వెళ్లిన వాహనాలను బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో దాదాపు తొమ్మిది వేల కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోది రాష్ట్ర పర్యటనకు రావడం జరిగిందన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధానమంత్రి గా మూడో సారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రప్రదంగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో జనాగ్రహ సభ పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి మోది హాజరయ్యే ఈ సభను ప్రతిష్టాత్మకంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించాలనే విధంగా రాష్ట్ర పార్టీ ఆలోచన చేసిందన్నారు. తెలంగాణలో బిజెపిని బలోపేతం చేసే లక్ష్యంతో , అశేష జన వాహినీ సభకు తరలివచ్చే విధంగా ప్రయత్నాలు చేసిందన్నారు. ఆ దిశలోనే జిల్లా పార్టీ ఆధ్వర్యంలో సభకు భారీ ఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు 120 ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులతో పాటు దాదాపు 500 (సొంత వాహనాలు) కార్లలో సభకు తరలి వెళ్లారన్నారు. ప్రధాని మోదీ సభ తో తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉందన్నారు. సభ అనంతరం దక్షణ భారతదేశానికి తెలంగాణ కీలక మలుపు అవుతుందని, బిజెపి కి ప్రవేశ ద్వారంగా తెలంగాణ అయ్యే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ రమేష్ ,ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ పుప్పాల రఘు, అసెంబ్లీ కన్వీనర్ పేరుక శ్రావణ్ ,ఇల్లంతకుంట మండల అధ్యక్షులు భూ ముల అనిల్, పంజాల ప్రశాంత్ ,దేశెట్టి శ్రీనివాస్ , ముత్తక్క మహేష్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత అబ్దార్ ఖానాల ప్రారంభం






**కరీంనగర్ టౌన్ మే10(పీసీడబ్ల్యూ న్యూస్):** దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం నగరంలోని రెండు ప్రాంతాల్లో ఉచిత అబ్దార్ ఖానాలను ప్రారంభించారు. ఒక అబ్దార్ ఖానాను సాహేత్‌నగర్‌లోని మస్జిద్ మహమ్మది ఎదుట డాక్టర్ బి. రాజ్‌కుమార్ ప్రారంభించగా, మరొకదాన్ని హుస్సేనీపురా చౌరస్తాలో కార్పొరేటర్ ముక్తదర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. రాజ్‌కుమార్ మరియు కార్పొరేటర్ ముక్తదర్ అలీ మాట్లాడుతూ, దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ మతాలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఎండాకాలంలో ప్రజలకు చల్లని మరియు మినరల్ వాటర్ అందించేందుకు అబ్దార్ ఖానాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ అబ్దుల్ ఖదూస్, అహ్మద్ జీది, హాఫిజ్ రిజ్వాన్, షకీల్ అహ్మద్, జమాలుద్దీన్, అజీమ్ ఖాన్‌తో పాటు మహమ్మది మస్జిద్ కమిటీ అధ్యక్షుడు అసీమ్ ఉద్దీన్ ఖాలిద్, అబ్దుల్ మతీన్, లియాఖత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట ఆర్.కే ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ




**తిమ్మాపూర్ మే 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామంలోని ఆర్.కే ఇండస్ట్రీస్ రైస్ మిల్ పై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం, బియ్యం నాణ్యత, తూకాలు, రికార్డులు, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్న తీరు వంటి అంశాలను ఎమ్మెల్యే సమగ్రంగా పరిశీలించారు. రైతుల నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సరైన తూకం, సరైన ధర అందేలా చూసుకోవాలని మిల్ నిర్వాహకులకు సూచించారు.అలాగే కార్మికుల పనివాతావరణం, భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ చర్యలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలు కాపాడటం తమ ప్రధాన బాధ్యత అని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ తనిఖీలో స్థానిక అధికారులు, మిల్ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చెన్నూరులో ఆధునిక ఏసి కోళ్ల ఫామ్ ప్రారంభం

### ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్

### పౌల్ట్రీ రైతులకు లాభదాయక మార్గమని ప్రశంసలు









**కల్లూరు, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఏసి కోళ్ల ఫామ్‌ను శనివారం సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఘనంగా ప్రారంభించారు. ఈ ఫామ్‌ను ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రిబ్బన్ కట్ చేసి ఫామ్‌ను ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నూరులో ఆధునిక పద్ధతులతో ఏసి పౌల్ట్రీ ఫామ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇటువంటి ఫామ్‌ల ద్వారా ఉత్పత్తి పెరిగి రైతులకు మంచి లాభాలు చేకూరుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, భాగం ప్రభాకర్, పోట్రు అర్జున్ రావు, చేపల సొసైటీ మాజీ జిల్లా అధ్యక్షులు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మర్సకట్ల బాలరాజు, కీసర మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, శీలం కృష్ణారెడ్డి, కల్లూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, దాసరి సుధారాణి, యాస శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు ఆలకుంట నరసింహారావు, మట్టా రామకృష్ణ, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్లూరు మున్సిపాలిటీలో రేపటి నుంచి జనగణన సర్వే ప్రారంభం

### - ప్రజల సహకారం కోరిన కమిషనర్ సీహెచ్ రాజశేఖర్



**కల్లూరు, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నుంచి జనగణన సర్వే ప్రారంభం కానుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ జనగణన ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని చెప్పారు. సర్వే నిర్వహణ కోసం మున్సిపాలిటీని మొత్తం 39 హెచ్‌ఎల్‌బీ బ్లాకులుగా విభజించినట్లు వెల్లడించారు.సర్వే కోసం 39 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించగా, పర్యవేక్షణ కోసం 6 మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా అవసరమైతే వినియోగించేందుకు 5 మంది రిజర్వ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు.ఈ సర్వేలో ప్రతి ఇంటిని నమోదు చేసి, పూర్తయిన ప్రతి గృహానికి ప్రత్యేక జనగణన నంబర్ కేటాయించనున్నట్లు కమిషనర్ వివరించారు.అందువల్ల మున్సిపాలిటీ ప్రజలు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి, సర్వే సిబ్బందికి అవసరమైన పూర్తి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మృత్యుఒడికి.. కర్లపల్లిలో తండ్రీకొడుకుల విషాదాంతం





**ములుగు జిల్లా కర్లపల్లి మే 10(పి సి డబ్ల్యూ న్యూస్ ):** ములుగు జిల్లా: గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో ఒక మూగజీవి ప్రాణాన్ని కాపాడాలనే మానవత్వం, చివరకు తండ్రీకొడుకులను బలితీసుకుంది. శనివారం జరిగిన ఈ ఘటనతో గ్రామం మొత్తం కన్నీరుమున్నీరవుతోంది.అసలేం జరిగింది?కర్లపల్లికి చెందిన రైతు రసపుత్ రాజు (41) పెంచుకుంటున్న లేగదూడ ప్రమాదవశాత్తు వారి ఇంటి ఆవరణలోని సుమారు 35 అడుగుల లోతున్న బావిలో పడిపోయింది. కళ్లముందే ప్రాణాపాయంలో ఉన్న దూడను చూసి చలించిపోయిన రాజు, ఎలాగైనా దాన్ని రక్షించాలని నిర్ణయించుకుని బావిలోకి దిగాడు. బావి లోపలికి వెళ్లిన రాజు ఎంతో శ్రమించి ఆ దూడకు తాడు కట్టగా, పైన ఉన్న ఆయన కుమారుడు రసపుత్ పవన్ (23) దానిని క్షేమంగా పైకి లాగాడు.దూడ ప్రాణం దక్కిందన్న సంతోషం నిలవకముందే విషాదం మొదలైంది. బావిలో ఆక్సిజన్ అందకపోవడంతో రాజు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. తండ్రి ఇబ్బంది పడటం గమనించిన కుమారుడు పవన్, ఏమాత్రం ఆలోచించకుండా ఆయన్ని కాపాడేందుకు బావిలోకి దిగాడు. అయితే, లోపల పేరుకుపోయిన విషవాయు వుల కారణంగా ఇద్దరూ ఊపిరి ఆడక బావిలోనే ప్రాణాలు కోల్పోయారు.గ్రామంలో విషాదఛాయలు: పవన్ ఇటీవల తపాలా శాఖలో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి చేదోడుగా మారుతున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం అందరినీ కలిచివేసింది. ఈ విషయం తెలుసుకున్న BRS ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న గారు ఆదివారం కర్లపల్లికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్థివ దేహాలకు పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, మృతుల కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కరీంనగర్‌లో యువజన కాంగ్రెస్ నేతలకు ఘన సత్కారం

**కరీంనగర్ టౌన్,మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన చేవెళ్ల మల్లికార్జున్, అహ్మద్ అలీ ఖాద్రి (సుఫియాన్)లను పడాల రాహుల్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌లో మరింత చురుకుగా పనిచేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగరేలా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువజన నేతలపై ఉందని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ మరియు చీూఖ×లో కష్టపడి పనిచేసే వారికి పార్టీలోనే కాకుండా ప్రభుత్వంలో కూడా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయని అన్నారు. అలాగే 2029 నాటికి రాహుల్ గాంధీ ను ప్రధాన మంత్రిగా చూడాలనే లక్ష్యంతో అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిలుకోయలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాలిన రవికుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**సిరోల్, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిరోల్ మండలం చిలుకోయలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాలిన రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన సమావేశంలో బాలిన రవికుమార్ ను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం గ్రామ విస్తృ స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా బానోత్ పాప, ప్రధాన కార్యదర్శిగా నాగటి ప్రభాకర్, కార్యదర్శిగా బుర్ర వెంకన్న, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దాసరి వీరేష్, కార్యవర్గ సభ్యులు గా పొన్నం బిక్షపతి, దాసరి వీరన్న (సీఎం), జోగి వెంకన్న, జోగి వీరన్న, ధరావత్ సైదులు లను ఎన్నుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు నాయకులు తెలిపారు. బాలిన రవికుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. గ్రామంలోని యువత, మహిళలు, రైతులు, కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు. బాలిన రవికుమార్‌కు పార్టీ అధ్యక్ష బాధ్యతలు దక్కడం పట్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిలుకోయలపాడు గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొజ్జ సతీష్ ఏకగ్రీవ ఎన్నిక

**- యువత సేవే లక్ష్యంగా ముందుకు సాగుతా: బొజ్జ సతీష్**



**సీరోల్, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీరోల్ మండలం చిలుకోయలపాడు గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా యువ నాయకుడు బొజ్జ సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, కార్యకర్తల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, బొజ్జ సతీష్ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, గ్రామ యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఆయన నాయకత్వంలో గ్రామంలో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా జాల రవికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దాసరి అశోక్, యూత్ ప్రధాన కార్యదర్శిగా పసలాది ప్రసాద్, కార్యదర్శిగా ఊడుగల వీరన్న, కార్యవర్గ సభ్యులుగా ఓర్రె గోపి, ఊడుగుల రాజేష్, జోగి మహేష్, బొజ్జ వీరేందర్, రాయబారపు పరశురాములను ఎనుకున్నారు. నూతనంగా ఎన్నికైన బొజ్జ సతీష్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న పార్టీ పెద్దలకు, నాయకులకు, యువకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామ యువతకు చేరవేసి, యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామాభివృద్ధి, యువత సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువకులు బొజ్జ సతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# మోదీ సభలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్ నగర్, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్న భారీ బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర నాయకులు, యదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి వేదికపై పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందుగానే పరేడ్ గ్రౌండ్స్ ప్రజలతో పూర్తిగా నిండిపోయిందని ఆయన పేర్కొన్నారు. యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో ఉత్సాహంగా సభకు హాజరై బీజేపీ పట్ల తమ అభిమానాన్ని చాటారని తెలిపారు. సాయంత్రం సమయానికి సభా ప్రాంగణం మొత్తం జనసందోహంతో కళకళలాడిందని, ప్రధాని మోదీ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, దేశ ప్రగతి కోసం ప్రధాని మోదీ నాయకత్వానికి ప్రజలు విశేష మద్దతు తెలుపుతున్నారనేది ఈ సభ ద్వారా స్పష్టమైందని ఆయన అన్నారు.

# ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణం ప్రారంభం



**షాద్ నగర్, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** చౌదరిగూడ మండలం కాసులాబాద్ గ్రామంలో కేశమోని లక్ష్మమ్మకు ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులు మాజీ సర్పంచ్ మోకార్ల గోపాల్ చేత ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని గ్రామ మాజీ సర్పంచ్ మోకార్ల గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం వేగంగా జరుగుతుందని, గతంలో లేని విధంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, కొత్త పథకాలు కూడా అమలవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సాలేటి మల్లేష్, వార్డు సభ్యులు మంచమోని తిరుపతయ్య, మోకార్ల బంటీ, కాంగ్రెస్ నాయకులు కిషన్ నాయక్, చెక్కలి చిన్న నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుడు సమాజానికి చైతన్య దీపిక

**● జానపద బహుజన యుద్ధనౌక పమ్మి రవికి మాదిగ ఉద్యోగుల ఘన సన్మానం ● దళితరత్న అవార్డు అందుకున్న పమ్మి రవిపై మాదిగ ఉద్యోగుల అభిమానం వెల్లువ**



**ఖమ్మం ప్రతినిధి, మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పాటను ఆయుధంగా, గళాన్ని సమాజ మార్పుకు వేదికగా మార్చుకున్న జానపద బహుజన యుద్ధనౌక, న్యాయవాది పమ్మి రవికి మాదిగ ఉద్యోగులు ఘన గౌరవ సన్మానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక "దళితరత్న" అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం ఖమ్మం నగరంలోని గొల్లగూడెం రోడ్డులోని సివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మాదిగ ఉద్యోగుల సమైక్య ఆధ్వర్యంలో అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సభ ప్రాంగణం సామాజిక చైతన్యం, కళాప్రేమ, గౌరవాభిమానాలతో కళకళలాడింది. ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు, కళాభిమానులు పెద్ద ఎత్తున హాజరై పమ్మి రవికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ... జానపద కళలను ఆయుధంగా చేసుకుని, బహుజన బతుకు చిత్రాలను తన పాటల్లో ప్రతిబింబింపజేస్తూ ప్రజలను మేల్కొల్పడంలో ఆయనది అగ్రస్థానం అన్నారు. నేటి తరం కవులకు, కళాకారులకు రవి జీవితం ఒక పాఠం. పదవుల కోసం కాకుండా, పీడిత ప్రజల పక్షాన నిలబడితే గుర్తింపు అదే వెతుక్కుంటూ వస్తుందని ఈ 'దళితరత్న' పురస్కారం నిరూపించిందన్నారు. **సామాజిక బాధ్యతకు దక్కిన పట్టాభిషేకం.** తెలంగాణ ప్రభుత్వం సరైన వ్యక్తికి, సరైన సమయంలో ఈ అవార్డును అందించిందని మాదిగ ఉద్యోగుల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. పమ్మి రవి పాటలు పల్లెల్లో నిద్రపోయిన ఆత్మగౌరవాన్ని మేల్కొల్పిందని, అన్యాయంపై పోరాటానికి కొత్త దిశ చూపిందని కొనియాడారు. కోర్టులో న్యాయం కోసం వాదించే న్యాయవాదిగా, వేదికపై సామాజిక చైతన్యాన్ని నింపే గాయకుడిగా ఆయన రెండు రంగాల్లోనూ అరుదైన సేవలందిస్తున్నారని అభిప్రాయపడ్డారు. "ఒక కళాకారుడు కనుమరుగైతే ఒక జాతి చరిత్ర మూగబోతుందన్నారు. చరిత్రను పాటల రూపంలో ప్రజల గుండెల్లో నిలిపే గాయకుడు పమ్మి రవి. ఆయన గళం బాధను మాత్రమే కాదు, బతుకు బాటను కూడా వినిపిస్తుంది" అని పలువురు భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. కళాకారులు సమాజానికి కేవలం వినోదాన్ని అందించేవారు కాదని, వారు ప్రజల మనోభావాలకు ప్రతిరూపాలని సభలో పలువురు గుర్తుచేశారు. కవి కలం సమాజానికి దారి చూపినట్లే, గాయకుడి గళం ప్రజల్లో చైతన్యాన్ని రగిలిస్తుందని తెలిపారు. యువతలో సామాజిక బాధ్యత పెంపొందించడంలో జానపద కళాకారుల పాత్ర అపారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, కోటా రవికుమార్, మోదుగు యాలాద్రి, అయినాల సైదులు, మేళ్లచెరువు బాబు, మురళీ, మందుల రవి, తెల్లూరి యాదగిరి, ఏఎస్ఐ బాబు, హెచ్చు గోపయ్యతో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ మాదిగ ఉద్యోగులు, కళాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



# తల్లిని మించిన దైవం లేదు మాతృదినోత్సవ వేడుకల్లో ఆదర్శ మహిళా సంక్షేమ సంఘం

**నిజాంపేట శ్రీనివాస్ నగర్ పార్కులో ఘనంగా మాతృదినోత్సవ వేడుకలు**

**తల్లుల సేవలను కొనియాడుతూ మహిళలకు సన్మానం చేసిన సంఘం ప్రతినిధులు**





**నిజాంపేట మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిజాంపేటలోని శ్రీనివాస్ నగర్ పార్కులో ఆదర్శ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వివిధ వయసుల తల్లులను ఘనంగా సన్మానిస్తూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగి, తల్లుల పట్ల గౌరవ భావాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు చలసాని భారతి మాట్లాడుతూ, "తల్లి సృష్టికి మూలం. తల్లి ప్రేమకు ప్రపంచంలో ఎటువంటి కొలమానం లేదు. బిడ్డకు మొదటి స్నేహితురాలు, మొదటి గురువు, జీవితానికి మార్గదర్శి తల్లే" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిని గౌరవించి, ఆమె చేసిన త్యాగాలను గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు. తల్లులతో కలిసి ఈ మాతృదినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, తల్లిని మించిన దైవం ఈ భూమిపై లేదని భావోద్వేగంగా తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గూడూరు శ్రీలత, సంయుక్త కార్యదర్శి పద్మకాంతి, సభ్యులు సుజాత, శైలజతో పాటు కార్యవర్గ సభ్యులు ఎం. సుజాత, నాగలక్ష్మి, ఫణి మరియు ఇతరులు పాల్గొన్నారు. తల్లుల సేవలను గుర్తిస్తూ వారికి శాలువాలు, పూలమాలలు అందజేసి సన్మానించారు. మాతృమూర్తుల ఆశీస్సులతో సాగిన ఈ వేడుకలో పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో తల్లుల పట్ల మరింత గౌరవాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.

# బావిలో పడ్డ బర్రెలు సురక్షితం.. సర్పంచ్ పుప్పాల రవీందర్ బృందం

**నర్సింహులపేట మే 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన ఒక సంఘటనలో గ్రామ సర్పంచ్ పుప్పాల రవీందర్ ఉప సర్పంచ్ దొనికేనా రామ్మూర్తి గ్రామస్థుల సహకారంతో సమయోచితంగా స్పందించి రెండు బర్రెల ప్రాణాలను రక్షించారు. గ్రామంలో ఉన్న కొత్త చెరువు వ్యవసాయ బావిలో వలసగా వచ్చిన రెండు బర్రెలు ప్రమాదవశాత్తు పడినట్లు గ్రామస్థులు సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ కు సమాచారం అందించారు. వెంటనే వారు హుటాహుటిన బావి వద్దకు చేరుకుని, గ్రామస్థులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో రక్షణ చర్యలు చేపట్టారు.

సమిష్టి కృషితో ఆ బర్రెలను సురక్షితంగా బయటకు తీసి కాపాడడం జరిగింది.

ప్రస్తుతం ఆ బర్రెలు గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్నట్లు సర్పంచ్ పుప్పాల రవీందర్ తెలిపారు. ఈ సంఘటన గ్రామ నాయకత్వం యొక్క బాధ్యతాయుత వైఖరి మరియు సేవా భావానికి నిదర్శనంగా



# విజయ్‌ని అన్‌ఫాలో చేసిన కొడుకు.. ప్రమాణ స్వీకారానికి భార్యాపిల్లలు గైర్హాజరు, మెరిసిన త్రిష

**తమిళనాడు** :తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన వేళ ఆయన కుటుంబ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. విజయ్ భార్య సంగీత, ఇద్దరు పిల్లలు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇక విజయ్‌ని సోషల్ మీడియాలో అతడి కుమారుడు అన్‌ఫాలో చేశాడు. అదే సమయంలో విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి నటి త్రిష హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. రాజకీయ విజయాల మధ్య విజయ్ కుటుంబ కలహాలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి.

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. దాదాపు 6 దశాబ్దాల డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల ఆధిపత్యాన్ని గద్దె దించుతూ.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆదివారం రోజున చంద్రశేఖర్



జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించి.. సరికొత్త చరిత్ర సృష్టించారు. అయితే.. విజయ్ జీవితంలో చారిత్రాత్మక వేడుకలో ఆయన భార్య సంగీత సోర్నలింగం.. పిల్లలు జేసన్ సంజయ్, దివ్య సాష గైర్హాజరు కావడం ఇప్పుడు తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారి ంది. మరీ ముఖ్యంగా భార్య సంగీతతో విడా కుల వ్యవహారం నడుస్తున్న వేళ.. జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆ కుటుంబం హాజరుకాకపోవడం చర్చకు దారి తీసింది.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయ్ బిజీగా ఉన్న సమయంలోనే.. ఈ ఏడాది మార్చి నెలలో చెంగల్పట్టు కోర్టులో ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 27 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్న సంగీత.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక నటితో విజయ్ వివాహేతర సంబంధం పెట్టుకు న్నారని.. అంతేకాకుండా ఆమెతో బంధాన్ని తెంచుకుంటానని తనకు హామీ ఇచ్చి కూడా మాట తప్పారని విడాకుల పిటిషన్‌లో పేర్కొన్నారు.అంతేకాకుండా తనను తీవ్ర అవమానాలకు గురిచేశారని.. ఆర్థికపరమైన ఆంక్షలు విధించారని కూడా సంగీత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం లండన్‌లో ఉంటున్న సంగీత.. బ్రిటన్ పౌరసత్వంతో అక్కడే ఉంటూ కుటుంబాన్ని, వ్యాపారాలను చూసుకుంటున్నారు. ఈ క్రమంలోనే వీరికి ఒక కొడుకు, ఒక కుమార్తె. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ (25), కుమార్తె దివ్య సాష (20) ప్రస్తుతం సంగీతతోనే లండన్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ఘనవిజయం సాధించిన రోజే.. జేసన్ తన తండ్రిని ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేయడం గమనార్హం. జేసన్ సంజయ్.. గతంలో విజయ్ సినిమా వేట్టైకారన్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించినప్పటికీ.. ఇప్పుడు కెమెరా వెనుక ఉండి తన కెరీర్‌ను మలుచుకుంటున్నారు. విజయ్ కుమార్తె దివ్య ఈ వివాదాలపై ఇప్పటి వరకు ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు.మరోవైపు.. విజయ్ కుటుంబ సభ్యులు ఆసక్తికరంగా మారింది.

## మాతృ దినోత్సవం రోజు దారుణం.. తల్లి, తమ్ముడ్ని కాల్చి చంపిన వ్యక్తి

**లక్నో:** మాతృ దినోత్సవం రోజున ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కన్న తల్లితోపాటు తమ్ముడ్ని తుపాకీతో కాల్చి చంపాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాజ్‌కిషోర్ గుప్తా కుటుంబానికి చెందిన పూర్వీకుల ఆస్తిని తండ్రి అమ్మాడు. దీని గురించి అతడు ఆగ్రహంతో ఉన్నాడు.కాగా, ఆదివారం తెల్లవారుజామున ఆ భూమి అమ్మకంపై తల్లి, తమ్ముడితో రాజ్‌కిషోర్ గొడవ పడ్డాడు. ఆగ్రహించిన అతడు గన్‌తో వారిపై కాల్పులు జరిపాడు. మాతృ దినోత్సవం రోజున కన్న తల్లితోపాటు సోదరుడ్ని హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు.మరోవైపు కాల్పుల శబ్దాలకు స్థానికులు ఉలిక్కిపడ్డారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తం మడుగుల్లో పడి ఉన్న మహిళ, ఆమె కుమారుడ్ని ఆసుపత్రికి తరలించగా



అప్పటికే వారు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆ ఇంటి నుంచి ఆధారాలు సేకరించారు. నిందితుడు రాజ్‌కిషోర్ అరెస్ట్ కోసం నాలుగు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు
పోలీస్ అధికారి తెలిపారు.

## ఎమ్మెల్యే పదవికి విజయ్ రాజీనామా.. అసెంబ్లీ కార్యదర్శికి లేఖ




**తమిళనాడు** :తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తిరుచ్చి ఈస్ట్ ఎమ్మెల్యే స్థానానికి విజయ్ రాజీనామా చేశారు. ఈ మేరకు విజయ్ తరుపున మంత్రులు వెంకట్రామన్, సెంగోట్టియన్ రాజీనామా లేఖను అసెంబ్లీ కార్యదర్శికి సమర్పించారు. గత ఎన్నికల్లో విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేసి గెలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. తిరుచ్చి ఈస్ట్ సీటును వదులుకున్నారు.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్.. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఈ ఎన్నికల్లో విజయ్ రెండుచోట్ల నుంచి పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి ఈస్ట్) స్థానానికి టీవీకే విజయ్ రాజీనామా చేశారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి పోటీ చేసి గెలిచిన విజయ్.. పెరంబూర్ ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే తిరుచ్చి ఈస్ట్ స్థానానికి ఆదివారం రాజీనామా చేశారు. విజయ్ తరఫున మంత్రులు సెంగోట్టియన్, వెంకట్రామన్ రాజీనామా లేఖను అసెంబ్లీ కార్య దర్శికి అందజేశారు. దీంతో ఆరు నెలల్లోపు ఈ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించే అవకా శాలు ఉన్నాయి.మరోవైపు చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విజయ్ తమిళనాడు 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రిగా తొలి ప్రసంగం చేసిన విజయ్.. భావోద్వేగంగా మాట్లాడారు. తమిళనాడులో ప్రజా ప్రభుత్వం కొలువు దీరిందన్న విజయ్.. డైరెక్టర్ కుమా రుడు ఈ రోజు ముఖ్యమంత్రి అయ్యాడంటూ ఎమోషనల్ అయ్యారు. తాను ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాయని.. అందరి వాడి నంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనను ఎంతోమంది ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టారని గుర్తు చేసుకున్నారు. గత డీఎంకే ప్రభుత్వ పాలన కారణంగా ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందన్న విజయ్.. హామీల అమలుకు కొంత సమయం ఇవ్వాలని ప్రజలను కోరారు.సాధ్యమయ్యేవే చెబుతామని.. చెప్పిందే చేస్తామన్న విజయ్.. తానేమీ దేవదూతను కాదని, సాదాసీదా వ్యక్తినని చెప్పుకొచ్చారు. తమిళ ప్రజల ఆకాంక్షలు తనకు తెలుసన్నారు. తాను తప్పు చేయనని.. తన చుట్టూ ఉన్నవారితోనూ తప్పు జరగకుండా చూస్తానన్నారు.

# విజయ్ ప్రమాణస్వీకార కార్యక్రమం.. వందేమాతర గేయం పూర్తిగా ఆలాపన



**తమిళనాడు** :తమిళనాడు ముఖ్యమంత్రివిజయ్ ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు వేదికపై వందేవ ాతర గేయాన్ని పూర్తిగా ఆలపించారు. ఈ సంద ర్భంగా గాయకులు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను పాడటం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని రెండు భాగాలను మాత్రమే ఆలపిస్తారు. అయితే ఇకపై అందులోని ఆరు చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.ఈ క్రమంలోనే ప్రమాణస్వీకారం సమయంలో తమిళనాడు కొత్త ప్రభుత్వం కేంద్రం ఉత్తర్వును తూచా తప్పకుండా పాటిం చింది. ఆ తర్వాత జాతీయ గీతం 'జనగణమన' ను, 'తమిళ తల్లి' గీతాలను ఆలపించారు. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరం గేయాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో ఆ గేయాన్ని చేర్చారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభు త్వం వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.ఆ గేయంలో ఆరు చరణాలుగా ఉండగా.. అందులో మతపరమైన ప్రస్తావన లేని రెండు భాగాలను ప్రభుత్వం స్వీకరించింది.

## ఉత్తర ప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ.. కొత్త మంత్రులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం



**ఉత్తర ప్రదేశ్ :** ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. ఆదివారం ఆరుగురు కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని లక్నోలోని జన్ భవన్‌లో ఆరుగురి చేత గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ప్రమాణ స్వీకారం చేయించారు. భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, క్రిష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దైలర్ మంత్రులుగా ప్రమాణం చేశారు.

వీరిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండేకు క్యాబినెట్ హోదా దక్కింది. అలాగే, మంత్రివర్గంలో మార్పులు కూడా చేపట్టారు యోగి ఆదిత్యనాథ్. ఇప్పటికే మంత్రులుగా ఉన్న అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్‌లకు స్వతంత్ర మంత్రులుగా అవకాశం కల్పించారు. ఉత్తర ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ రాజ కీయ అవసరాలకు అనుగుణంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి, పలువురికి అవకాశం కల్పిం చారు. యోగి 2.0లో 2024లో చేపట్టిన మంత్రివర్గ విస్తరణ తర్వాత మళ్లీ మంత్రివర్గాన్ని విస్తరించడం ఇదే మొదటిసారి.ఈసారి మంత్రివర్గ విస్తరణలో కూటమి పార్టీలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు.

# విజయ్ తొలి కేబినెట్‌లో.. ౮ మంది మంత్రులు వీరే

**చెన్నై:** దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యం తర్వాత తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. నటన నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆదివారం ఉదయం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సమక్షంలో విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో 9 మంది టీవీకే ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

1. ఎన్. ఆనంద్: విజయ్ పార్టీని ప్రారం భించక ముందే ఆయన అభిమాన సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. టీవీకే ఏర్పాటులో కీలకమైన నిర్వహణ, నైపుణ్యాన్ని అందించారు. ఆ పార్టీకి మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. ఆ పార్టీ ప్రముఖ అధికార ప్రతినిధుల్లో ఆయన కూడా ఒకరు.

2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నైలోని త్యాగరాయనగర్ నియోజకవర్గం నుంచి ఆనంద్ పోటీ చేశారు. చారిత్రకంగా డీఎంకే, అన్నాడీఎంకే ఆధిపత్యం వహించే ఈ స్థానంలో 51,632 ఓట్లు సాధించారు. డీఎంకే అభ్యర్థి రాజా అన్బళగన్‌ను ఆయన ఓడించారు. 2. ఆధవ్ అర్జున: 6 అడుగుల 7 అంగుళాల ఎత్తుతో ఆకట్టుకునే మాజీ జాతీయ స్థాయి




బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఆధవ్ అర్జున. తమిళనాడుకు చెందిన రాజకీయ వ్యూహకర్త, దాత, క్రీడా నిర్వాహకుడు. గత ఎన్నికల్లో డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్‌తో ఆయన పనిచేశారు. డీఎంకే విజయంలో కీలక పాత్ర పోషించారు. 2026 ఎన్నికల్లో చెన్నైలోని విల్లివాక్కం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా ఆధవ్ అర్జున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ పార్టీలో ఎన్నికల ప్రచార నిర్వహణకు సంబంధించిన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తద్వారా పార్టీ అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి ఎన్ ఆనంద్ తర్వాత టీవీకేలో అత్యున్నత స్థాయి పదవిలో ఉన్న నాయకుడిగా ఆయన నిలిచారు. బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కూడా ఆయన వ్యవహ రిస్తున్నారు. 3. ఎస్ కీర్తన: విజయ్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రి. తమిళనాడులోని బాణసంచా పరిశ్రమకు కేంద్రమైన శివకాశి నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 29 ఏళ్ల కీర్తన, విజయ్ మంత్రివర్గంలో అతి పిన్న వయస్కురాలు.

హిందీలో అనర్గళంగా మాట్లాడే ఆమె, క్షేత్రస్థాయి రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ ఎన్నికల వ్యూహంలో కీలక పాత్ర పోషించారు. రాజకీయ సలహాదారుగా కూడా పనిచేశారు.

శివకాశిలోని బాణసంచా పరిశ్రమల కార్మికులకు క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, మహిళలకు సమాన వేతనం కల్పిస్తామని కీర్తన హామీ ఇచ్చారు. 4. డాక్టర్ కేజీ అరుణ్‌రాజ్: తమిళనాడుకు చెందిన వైద్యుడు, మాజీ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి. టీవీకే పార్టీకి విధాన, ప్రచార వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో నామక్కల్ జిల్లాలోని తిరుచెంగోడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

5. డాక్టర్ టీకే ప్రభు: ఆయన దంత వైద్యుడు. టీవీకేలో కీలక నేత. కారైకుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. విజయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 6. కేఏ సెంగోట్టయ్యన్: అన్నాడీఎంకేలో అత్యంత సీనియర్ నేత. ఐదు దశాబ్దాల అనుబంధం తర్వాత గత సంవత్సరం ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. విజయ్ పార్టీలో చేరి తమిళనాడులో రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. 7. పి వెంకటరమణన్: న్యా యవా ది అయిన ఆయన చెన్నైలోని కీలకమైన మైలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీవీకే కోశాధి కారిగా ఆయన వ్యవహరిస్తున్నారు. క్రియాశీల రాజకీయాలకు కొత్త అయినప్పటికీ, 2000 నుంచి విజయ్‌కు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు చాలాకాలంగా సన్నిహితుడిగా ఉన్నారు.

## ఒక్క ఓటుతో ఓడిన డీఎంకే మాజీ మంత్రి.. టీవీకే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవాలంటూ హైకోర్టులో పిటిషన్



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన డీఎంకే మాజీ మంత్రి ఒకే ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టును ఆయన ఆశ్రయించారు. ఆ స్థానంలో గెలిచిన టీవీకే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవాలని కోరారు. డీఎంకే మాజీ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్, తిరుపత్తూరు అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే టీవీకే అభ్యర్థి సీనివాస సేతుపతి చేతిలో కేవలం ఒక్క ఓటు తేడాతో ఆయన ఓడిపోయారు. సీనివాస సేతుపతి 83,375 ఓట్లు సాధించారు.కాగా, శివగంగ జిల్లాలోని తిరుప్పత్తూరు నియోజకవర్గానికి చెందిన ఓటరు మణికందన్ శివానంతం, సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తాను ఓటు వేయడానికి మస్కట్ నుంచి వచ్చినందుకు 'గర్వంగా' ఉన్నదని తెలిపాడు. తన ఒక్కడి ఓటు ఇక్కడి ఫలితాన్ని మార్చి వేసి ఉంటుందని పేర్కొన్నాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.ఈ నేపథ్యంలో ఒక్క ఓటు తేడాతో ఓడిన డీఎంకే అభ్యర్థి కేఆర్ పెరియకరుప్పన్, మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు కొత్తగా ఎన్నికైన టీవీకే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయకుండా లేదా శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిరోధించేలాచేయాలని కోరారు.

## గన్ గురిపెట్టి, డబ్బులు ఇవ్వమని వేడుకున్న టీచర్.. తర్వాత ఏం జరిగిందంటే?



**లక్నో:** టీచర్‌గా పని చేస్తున్న వ్యక్తి అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఒక చోట దోపిడీకి ప్రయత్నించాడు. గన్ గురిపెట్టిన అతడు డబ్బులు ఇవ్వమని బతిమిలాడాడు. అక్కడి నుంచి పారిపోతుండగా జనం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి 8 గంటల సమయంలో కాజీ సరాయ్ ప్రాంతంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ)కు ఒక వ్యక్తి చేరుకున్నాడు. తలకు హెల్మెట్ ధరించిన అతడు గ్రిల్ నుంచి సీఎస్సీ ఆపరేటర్ జావేద్ అలీకి తుపాకీ గురిపెట్టాడు. 'నేను చాలా అప్పు చేశాను. నాకు రూ. 10,000 ఇవ్వండి' అని పలుమార్లు వేడుకున్నాడు.కాగా, సీఎస్సీ ఆపరేటర్ జావేద్ అలీ అప్రమత్తం కావడంతో ఆ వ్యక్తి బయటకు పరుగెత్తాడు. అయితే రోడ్డుపై ఉన్న జనం అతడ్ని పట్టుకుని కొట్టారు. ఆ తర్వాత పోలీసులకు అప్పగించారు. వారణాసిలోని భరత్‌పూర్ గ్రామానికి చెందిన గౌతమ్ పటేల్‌గా గుర్తించారు. ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా అతడు పనిచేస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు.

మరోవైపు పెరుగుతున్న అప్పులు, నెలవారీ వాయిదాల కారణంగా తాను తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్నట్లు గౌతమ్ పోలీసులకు తెలిపాడు. అందుకే దోపిడీకి ప్రయత్నించినట్లు అతడు చెప్పాడు. దీంతో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

## చార్టర్ బోటులో భారీ పేలుడు.. 11 మందికి గాయాలు



**అమెరికా:** అమెరికా ఫ్లోరిడా రాష్ట్రం లో ఓ చార్టర్ బోటు భారీ పేలుడు సంభవించింది. మియామి నగర సమీపంలోని బిస్కేన్ బేలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒక చిన్నారితో సహా 11 మంది గాయపడ్డారు. పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన హాలోవర్ సాం డ్‌బార్ సమీపంలో ఈ ఘటన జరిగింది. 'నాటీ నేబర్స్' అనే 40 అడుగుల పడవలో సుమారు 14 మంది ప్రయా ణిస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవి ంచింది. ఈ ధాటికి బోటులో ఉన్న ప్రయా ణికులు గాల్లోకి ఎగిరి నీటిలో పడ్డారు. మాచారం అందుకున్న వెంటనే మియామి–డేడ్ ఫైర్ రెస్క్యూ, యూఎస్ కోస్ట్ గార్డ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా దీనిని 'లెవెల్ 2 మాస్ క్యాజువాలిటీ'గా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరికి తీవ్రంగా కాలిన గాయాలు కాగా..

మరికొందరికి స్వల్ప గాయాల య్యా యని అధికారులు తెలిపారు.

బోటు ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో గ్యాస్ లీక్ కావడం వల్లే ఈ పేలుడు జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

బోటు కెప్టెన్ తొందరపడి భద్రతా నిబంధనల ప్రకారం బ్లోయర్లను ఆన్ చేయకుండానే ఇంజిన్ స్టార్ట్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఒక ప్రత్యక్ష సాక్షి ఆరోపించారు.

## చెపాక్‌లో ఉర్విల్ ఊచకోత.. ఎనిమిదో ఓటమితో లక్నో ఔట్..!

లీగ్ దశ ఆఖర్లో గొప్పగా ఆడుతున్న సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. చెపాక్‌లో ఉర్విల్ పటేల్ (65) రికార్డు అర్ధ శతకంతో మెరవగా.. లక్నో సూపర్ జెయింట్స్ సీఎస్కే 5 వికెట్లతో జయభేరి మోగించింది. 204 పరుగుల ఛేదనలో లక్నో బౌలర్ల భరతం పట్టిన ఉర్విల్.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో గెలుపు తోవలో నడిపాడు. కానీ.. మిడిల్ ఓవర్లలో షాదాబ్, దిగ్వేశ్ రథీల విజృంభణతో మ్యాచ్ లక్నోవైపు మళ్లింది. కానీ, డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు కళ్లుచెదిరే సిక్సర్లతో లక్నో ఆశల్ని ఆడియాసలు చేశారు.పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ విజయ గర్జన చేసింది. బౌలర్లు ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించిన చోట.. కుర్రాడు



ఉర్విల్ పటేల్(65 : 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడగా లక్నో బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ఆఖర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు ఒత్తిడికి లోన్వ కుండా చెన్నైకి 5 వికెట్ల విజయాన్ని కట్టబె ట్టారు. ఆరో విక్టరీతో 12 పాయింట్లు సాధించిన చెన్నై.. టాప్-5లో నిలిచింది. 11 మ్యాచుల్లో ఎనిమిదింటా వైదొలిగింది.

## అర్ధశతకంతో రెచ్చిపోయిన ఇంగ్లిస్.. చెన్నై ముందు భారీ లక్ష్యం..!

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేశాడు. కానీ, ఓవర్టన్(3-36), అన్షుల్ కంబోజ్(2-47)లు వికెట్ల వేటతో మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ రెండొందలు దాటించారు. ఒకదశలో 230 ప్లస్ కొట్టేలా కనిపించినా చివరకు వీరిద్దరి కృషి ఫలితంగా లక్నో 203కు పరిమితమైంది.
చెపాక్ స్టేడియంలో టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అదిరే ఆరంభమిచ్చాడు.



మిచెల్ మార్ష్(10), పూరన్(1)లు విఫలమైనా..పవర్ హిట్టింగ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లకు చుక్కలు చూపిన ఇంగ్లిస్ 17 బంతుల్లోనే అర్ధ శతకంతో కదం తొక్కాడు. అతడి ధాటికి రాకెట్‌లా లక్నో స్కోర్ పరుగులు పెట్టింది. అయితే.. భారీ స్కోర్ దిశగా సాగుతున్న లక్నోను ఓవర్టన్ దెబ్బకొట్టాడు. పదో ఓవర్లో డేంజరస్ ఇంగ్లిస్, రిషభ్ పంత్(15)ను ఔట్ చేసి లక్నో స్కోర్ వేగానికి బ్రేకులు వేశాడు. షాదాబ్ ధనాధన్‌ఓవర్టన్ విజృంభణతో 77/1తో పటిష్ట స్థితిలో ఉన్న లక్నో.. ఒక్కసారిగా తడబ డింది. మర్క్‌రమ్(6), రఘువంశీ(18)లు త్వర గానే ఔటైనా.. షాదాబ్ అహ్మద్(47 నాటౌట్) నిలబడ్డాడు. ఓవర్టన్ వేసిన 19వ ఓవర్లో రెచ్చిపోయిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 4, 6, 4 కొట్టాడు. హిమ్మత్ చేశాడు.

## సీనియర్లకే మరో ఛాన్స్.. ఇద్దరు పేసర్లతో ప్రపంచకప్ స్క్వాడ్..!

మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్నందున బంగ్లాదేశ్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. నిగర్ సుల్తానా కెప్టెన్‌గా పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. గత ఎడిషన్ స్క్వాడ్‌లోని 11 మందికి మళ్లీ చోటు దక్కగా.. సీనియర్ షర్మీన్ సుల్తానా స్థానంలో టాపార్డర్ బ్యాటర్ తేజ్ నెహర్‌కు సెలెక్టర్లు అవకాశమ ఇచ్చారు. అయితే.. అందర్నీ ఆశ్చర్య పరుస్తూ ఈ ఐసీసీ ఈవెంట్‌లో ఇద్దరు పేసర్లతోనే బంగ్లా జట్టు ఆడనుంది.అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ప్రపంచకప్ పండుగకు బంగ్లాదేశ్ మహిళల జట్టు సిద్ధమవుతోంది. స్క్వాడ్ ఎంపిక అనంతరం చీఫ్ సెలెక్టర్ సజాద్ అహ్మద్ మాట్లాడుతూ ఇద్దరు పేసర్లను మాత్రమే తీసుకోవడంపై వివరణ ఇచ్చాడు. 'బంగ్లాదేశ్



బృందంలో ఇద్దరు పేసర్లు ఉండడానికి కారణం పేసర్లు త్వరగా గాయపడుతారు. పైగా ఇంగ్లండ్‌లో వికెట్ ఒకప్పటిలా పేస్‌కు కాకుండా ఉపఖండం మాదిరిగా ఉంటుందని తెలిసింది. అంటే.. స్పిన్నర్లకు అనుకూలిస్తాయి. సో.. అందుకే స్పిన్నర్లపై నమ్మకం ఉంచాం. వన్డేల్లో రాణిస్తున్న షర్మీన్ సుల్తానా బదులు తేజ్ నెహర్‌ను ఎంపిక చేయడానికి కారణముంది. నెహర్ వైవిధ్యమైన ప్లేయర్. ఆమె ఓపెనింగ్ నుంచి ఆరో స్థానంలో ఎక్కడైనా ఆడగల సమర్థురాలు. డెత్ ఓవర్లలో తను గొప్పగా ఆడగలదు' అని సజాద్ వెల్లడించాడు. అంతేకాదు ఫార్మాట్‌కు తగ్గట్టుగా దూకుడైన ఆట ఆడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.'బంగ్లాదేశ్ జట్టు డిఫెన్స్ స్టయిల్ బ్యాటింగ్ అతిపెద్ద సమస్యగా మారింది. ఒక్కరాత్రిలోనే అంతా మారిపోతుందని నేను చెప్పను. కానీ, ఈ సమస్యను పరిష్కరించేందుకు సెలెక్టర్లు ప్రయత్నిస్తున్నారు' అని సజాద్ తెలిపాడు. టాపార్డర్‌లో నిగర్ సుల్తానా, షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, తేజ్ నెహర్ కీలకం కానున్నారు. నిరుడు భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్‌కప్‌లో మెరిసిన యువ పేసర్ మరుఫా అక్తర్‌తో పాటు ఫరిహా ఇస్లాం కొత్త బంతిని పంచుకోనుంది. వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా నెదర్లాండ్స్, స్కాట్లాండ్‌తో ముక్కోణపు సిరీస్ ఆడనుంది. ఇంగ్లండ్ వేదికగా జూన్12 నుంచి పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది.
బంగ్లాదేశ్ ప్రపంచకప్ స్క్వాడ్ : నిగర్ సుల్తానా జోటీ(కెప్టెన్), నహిదా అక్తర్(వైస్ కెప్టెన్), షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, షోర్నా అక్తర్, రీతు మోని, రబేయ ఖాన్, పాహిమా ఖాతూన్, ఫరీహ ఇస్లాం, మరుఫా అక్తర్, షాంజిద అక్తర్, సుల్తానా ఖాతున్, దిలరా అక్తర్, జుయైరియా ఫిర్దౌస్, తాజ్ నెహర్.

## టాస్ ఆర్సీబీదే.. ముంబై ఓడిందంటే ఇంటికే..!





ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన ఆర్సీబీ కీలక మ్యాచ్ ఆడుతోంది. ఈ సీజన్‌లో తీవ్రంగా నిరాశపరుస్తున్న ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌ను ఢీ కొడుతోంది. రాయ్‌పూర్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన రజత్ పాటిదార్ బౌలింగ్ తీసుకున్నాడు. నాలుగో స్థానంలో కొనసాగుతున్న బెంగళూరు గెలిస్తే.. ముంబై ఇంటికి వెళ్లడం ఖాయం.
డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో ఆర్సీబీ, ముంబై మధ్య కాసేపట్లో బిగ్ మ్యాచ్ జరుగనుంది. ఇరుజట్లకు ఇది చాలా కీలకమైన మ్యాచ్ కావడంతో విజయం కోసం హోరాహోరీ తప్పదు. ముంబై సారథి హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోవడంతో సూర్యకుమార్ యాదవ్ టాస్‌కు వచ్చాడు. తొలుత బ్యాటింగ్ చేసేందుకు తాము ఆతమ విశ్వాసంతో ఉన్నామని చెప్పాడు సూర్య.ఆర్సీబీ తుది జట్టు : విరాట్ కోహ్లీ, జాకబ్ బెథెల్, పటిదార్(కెప్టెన్), జితేశ్ శర్మ(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమా రియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ, రసిక్ దార్ సలాం.ఇంప్యాక్ట్ సబ్స్‌అయ్యర్.

## ఆరో విజయంతో ప్లే ఆఫ్స్‌కు చేరువైన సీఎస్కే.. లక్నో ఖేల్ ఖతం..!

ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 204 పరుగుల భారీ లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యువ బ్యాటర్ ఉర్విల్ పటేల్ కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది లక్నో బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టగా, చివరి ఓవర్‌లో శివమ్ దూబె వరుస సిక్సర్లతో



మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఓటమితో లక్నో టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించగా, సీఎస్కే 12 పాయింట్లతో ఐదో స్థానానికి చేరుకుని ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకుంది.
ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్.. ఆరో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచులో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 204 పరుగుల లక్ష్యాన్ని మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఛేజ్ చేసింది. 180కి పైగా పరుగుల లక్ష్యం అంటేనే హడలిపోయే చెన్నై సూపర్ కింగ్స్‌ను.. ఉర్విల్ పటేల్ తన అద్భుత బ్యాటింగ్‌తో గట్టెక్కించాడు. 23 బంతుల్లో 65 రన్స్ చేసి.. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 203/8 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్ 33 బంతుల్లో 85 రన్స్ చేసి సత్తాచాటాడు. చివర్లో షాబాజ్ అహ్మద్ 25 బంతుల్లో 43 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. సీఎస్కే బౌలర్లలో జెమీ ఓవర్టన్ 3, అన్షుల్ కాంబోజ్ 2, నూర్ అహ్మద్ 1 వికెట్ తీశారు.అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సీఎస్కేకు ఓపెనర్లు శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 22 బంతుల్లో 45 రన్స్ జోడించారు. ఆ తర్వాత వచ్చిన ఉర్విల్ పటేల్.. లక్నో బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో మ్యాచ్ గమనమే మారిపోయింది. తాను ఎదుర్కొన్న తొలి 9 బంతుల్లోనే 42 రన్స్ చేసిన అతడు.. 13 బంతుల్లో హాఫ్ సెంచరీ కొట్టాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును సమం చేశాడు. పవర్ ప్లే ముగిసే సరికి సీఎస్కే 97/1తో నిలిచి విజయం దిశగా అడుగులు వేసింది.
కానీ 23 బంతుల్లో 65 రన్స్ చేశాక ఉర్విల్ పటేల్ ఔట్ అయ్యాడు. అప్పటి నుంచి మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. లక్నో బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో పరుగులు రావడం కష్టమైంది. సీఎస్కే వికెట్లు కూడా కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. సీఎస్కే విజయానికి చివరి 3 ఓవర్లలో 30 రన్స్ అవసరం అయ్యాయి. చివరి ఓవర్‌లో 10 రన్స్ అవసరం కాగా.. తొలి రెండు బంతులను సిక్సర్‌గా మలిచిన దూబె.. మ్యాచ్ ముగించాడు. దీంతో సీఎస్కే.. ఐపీఎల్‌లో తన రెండో అత్యధిక విజయవంతమైన రన్ ఛేజ్‌ను పూర్తి చేసింది.ఈ విజయంతో సీఎస్కే.. 12 పాయింట్లతో ఐదో ప్లేసుకు దూసుకొచ్చింది. ఇతర జట్లకు గట్టి హెచ్చరికలు పంపింది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ 8వ ఓటమితో.. టోర్నీ నుంచి నిష్క్రమించింది!

## చెన్నైకి కొత్త హీరో దొరికాడు.. ఉర్విల్ ఊచకోత.. 13 బంతుల్లో హాఫ్ సెంచరీ..!



చెన్నై సూపర్ కింగ్స్ యువ బ్యాటర్ ఉర్విల్ పటేల్ ఐపీఎల్‌లో సరికొత్త చరిత్ర సృష్టిం చాడు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో కేవలం 13 బంతు ల్లోనే హాఫ్ సెంచరీ మార్కును చేరుకోవడం ద్వారా ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును (యశస్వి జైశ్వాల్‌తో కలిపి) సమం చేశాడు. 204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సీఎస్కేకు ఉర్విల్ తన మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభం అందించాడు. తొలి 9 బంతుల్లోనే 42 పరుగులు చేసిన అతడు, లక్నో బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచు కుపడ్డాడు.ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ యంగ్ బ్యాటర్.. ఉర్విల్ పటేల్ రికా ర్డుల మోత మోగించాడు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచులో అతడు.. పెను విధ్వంసం సృష్టించాడు. 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కొట్టాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును సమం చేశాడు. గతంలో రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన యశస్వి జైశ్వాల్ కూడా ఇన్నే బంతుల్లో ఫిఫ్టీ కొట్టాడు.204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఓపెనర్లు సంజూ శాంసన్, రుతు రాజ్ గైక్వాడ్ మెరుపు శుభారంభం ఇచ్చారు. 22 బంతుల్లో 45 పరుగులు జోడించారు. 14 బంతుల్లో 28 రన్స్ చేసిన తర్వాత సంజూ శాంసన్ తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. అయితే ఈ అనందం లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు ఎంతో సేపు నిలవలేదు. ఉర్విల్ పటేల్ రూపంలో వారిపైకి పెను సునామీ దూసుకొచ్చింది.
చెన్నై సూపర్ కింగ్స్ యువ బ్యాటర్ ఉర్విల్ పటేల్ ఐపీఎల్‌లో సరికొత్త చరిత్ర సృష్టిం చాడు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో కేవలం 13 బంతు ల్లోనే హాఫ్ సెంచరీ మార్కును చేరుకోవడం ద్వారా ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును (యశస్వి జైశ్వాల్‌తో కలిపి) సమం చేశాడు. 204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సీఎస్కేకు ఉర్విల్ తన మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభం అందించాడు. తొలి 9 బంతుల్లోనే 42 పరుగులు చేసిన అతడు, లక్నో బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు.
దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన ఉర్విల్ పటేల్‌ను సీఎస్కే ఏరికోరి సొంతం చేసుకుంది. అయితే ఇప్పటివరకు అతడు స్థాయికి తగ్గ ప్రదర్శన మాత్రం చేయలేకపోయాడు. కానీ ప్లే ఆఫ్స్ చేరాలంటే గెలవాల్సిన మ్యాచులో సీఎస్కే తరఫున దుమ్మురేపాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచి బాదడమే పనిగా పెట్టుకున్నాడు. తొలి బంతి నుంచి ఎటాకింగ్ గేమ్‌తో అదరగొట్టాడు.1, 6, 6, 6, 6, 4, 6, 1 ఇవి తొలి 9 బంతుల్లో అతడు నమోదు చేసిన స్కోర్లు. 9 బంతుల్లోనే అతడు 42 పరుగులు స్కోరు చేశాడు. మరో మూడు బంతుల్లో ఫిఫ్టీ స్కోరు చేస్తే.. ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ నమోదు చేసేవాడే. కానీ మిగతా 8 పరుగులు పూర్తి చేసేందుకు అతడు మరో నాలుగు బంతులు తీసుకున్నాడు. దీంతో 13 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్కును చేరుకున్నాడు. ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును సమం చేశాడు. గతంలో ఈ రికార్డు యశస్వి జైశ్వాల్ పేరిట ఉండేది. అతడు ఐపీఎల్ 2023లో కేకేఆర్‌తో మ్యాచులో రాజస్థాన్ రాయల్స్ తరఫున 13 అందుకున్నాడు.

## వరల్డ్ రికార్డ్ సృష్టించిన వైభవ్ సూర్యవంశీ.. వంద సిక్సర్లను ఊదేసిన బుడ్డోడు

ఐపీఎల్ విధ్వంసకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తాజాగా ఓ రికార్డును బద్దలు కొట్టాడు. ఐపీఎల్ పవర్ ప్లేలో అత్యధిక సిక్సర్లు నమోదు చేసిన ప్లేయర్‌గా నిలవడమే కాకుండా.. టీ20 హిస్టరీలోనే అతి తక్కువ బంతుల్లో వంద సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా కూడా వైభవ్ నిలిచాడు. కేవలం 514 బంతుల్లోనే వైభవ్ సూర్యవంశీ వంద సిక్సర్లు బాది అతి తక్కువ వయస్సులో ఈ రికార్డును క్రియేట్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. అంతేకాకుండా అభిషేక్ పేరిట ఉన్న 29 సిక్సర్ల పవర్ ప్లే రికార్డును కూడా బద్దలు కొట్టాడు.
ఐపీఎల్ బుల్లి డైనమైట్ వైభవ్ సూర్యవంశీ దెబ్బకు వరల్డ్ రికార్డులు సలాములు కొడుతున్నాయి. ఇప్పటికే 35 బంతుల్లో సెంచరీ, 36 బంతుల్లో సెంచరీలతో ఇండియా తరపున ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీలు చేసిన వైభవ్ సూర్యవంశీ .. ఇప్పుడు సిక్సర్ల జాబితాలో ఏకంగా ప్రపంచ రికార్డు బద్దలుకొట్టాడు. టీ20 కెరీర్‌లో అత్యంత తక్కువ వయస్సులో వంద సిక్సర్లు అందుకున్న ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు.
2025లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆ ఏడాదే గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో సెంచరీ చేసి క్రికెట్ బాస్ క్రిస్ గేల్ తర్వాత ఈ ఫీట్‌ను అందుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో సన్‌రైజర్స్



హైదరాబాద్‌పై 36 బంతుల్లోనే సెంచరీ బాది మరోసారి భారత క్రికెటర్లలో అతి తక్కువ బంతుల్లో సెంచరీ చేసిన ఆటగాళ్ల జాబితాలో ఒకటి, రెండు స్థానాల్లోనూ సూర్యవంశీనే నిలిచాడు.జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ తొలి ఓవర్‌లో తాను ఎదుర్కొన్న మొదటి బంతినే సిక్సర్‌గా మలిచి వంద సిక్సర్లను నమోదు చేశాడు. టీ20 హిస్టరీలోనే అతి తక్కువ బంతుల్లో వంద సిక్సర్లు నమోదు చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. కేవలం 514 బంతుల్లోనే వంద సిక్సర్లు బాదిన యంగెస్ట్ ప్లేయర్‌గానూ సూర్యవంశీ నిలవడం విశేషం.దాంతో పాటు పవర్ ప్లేలో ఇప్పటి వరకు అత్యధిక సిక్సర్లు నమోదు చేసిన ప్లేయర్‌గా కూడా వైభవ్ సూర్యవంశీనే నిలవడం విశేషం. ఇప్పటి వరకు ఈ రికార్డు వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్ అభిషేక్ శర్మ పేరు మీద ఉండగా.. తాజాగా ఆ రికార్డును సూర్యవంశీ బ్రేక్ చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 ఇంకా మ్యాచ్‌లు మిగిలుండగానే పవర్ ప్లేలో 30 సిక్సర్లు నమోదు చేశాడు. 2024లో అభిషేక్ శర్మ 29, 2026లో అభిషేక్ శర్మ 27, 2008లో సనత్ జయసూర్య 22, 2024లో ట్రావిస్ హెడ్ 22, 2025లో యశస్వి జైస్వాల్ 22 సిక్సర్లతో వైభవ్ తర్వాత స్థానాల్లో నిలిచారు.

## ఐపీఎల్‌లో సంచలనం.. రికార్డు హాఫ్ సెంచరీ బాదిన అన్‌క్యాప్డ్ ప్లేయర్..!





ఐపీఎల్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉర్విల్ పటేల్ చరిత్ర సృష్టించాడు. పంతొమ్మిదో సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝులిపించిన ఈ చెన్నై చిన్నోడు రికార్డు అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. చెపాక్ స్టేడియంలో పూనకం వచ్చినట్టే ఆడిన ఉర్విల్.. ఏకంగా 13 బంతుల్లోనే యాభై రన్స్‌తో చెలరేగాడు. తద్వారా ఈ మెగా టోర్నీ చరిత్రలో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీతో యశస్వీ జైస్వాల్( రికార్డును సమం చేశాడీ హిట్టర్.చెపాక్ స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించాడు ఉర్విల్ పటేల్. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను ఊచకోత కోసిన ఉర్విల్.. ఎదుర్కొన్న ఎనిమి ది బంతులను.. 1, 6, 6, 6, 6, 4, 6 గా మలిచి అర్ధ శతకానికి చేరువయ్యాడు. అవేశ్ ఖాన్, దిగ్వేజ్ రథీ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన ఉర్విల్.. షమీ, షాదాబ్‌ను ఉతికేస్తూ 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చరిత్ర లిఖించాడు.కోల్‌కతా నైట్ రైడర్స్2023లో యశస్వీ జైస్వాల్ నెలకొల్పిన వేగవంతమైన ఫిఫ్టీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. కమిన్స్, కేఎల్ రాహుల్, రొమారియో షెపర్డ్ 14 బంతుల్లో అర్ధ శతకంతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ వీళ్లే..యశస్వీ జైస్వాల్ (రాజస్థాన్ రాయల్స్)- 13 బంతుల్లో -- కోల్‌కతాపై 2023లో.ఉర్విల్ పటేల్ (చెన్నై సూపర్ కింగ్స్) -- 13 బంతుల్లో -- లక్నోపై 2026లో.
కేఎల్ రాహుల్(పంజాబ్ కింగ్స్) -- 14 బంతుల్లో -- ఢిల్లీ క్యాపిట ల్స్‌పై 2018లో.ప్యాట్ కమిన్స్(కోల్‌కతా నైట్ రైడర్స్) -- 14 బంతుల్లో ముంబై ఇండి య న్స్‌పై 2022లో.
రొమారియో షెపర్ (ఆర్సీబీ)- 14 బంతుల్లో -- చెన్నై సూపర్ కింగ్స్‌పై 2025లో .

# 'సండే కూడా హాలిడే లేదా అమ్మా'.. మహేష్ బాబు కామెడీ టైమింగ్ మామూలుగా ఉండదు మరి




సూపర్ స్టార్ మహేష్ బాబు తనదైన స్టైల్‌లో వేసిన ఒక చిన్న జోక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'వారణాసి' సినిమా షూటింగ్ విరామంలో విదేశాలకు వెళ్లిన మహేష్, తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ వద్ద తనను ఫోటోలు తీస్తున్న కెమెరామెన్లను చూసి "సండే కూడా హాలిడే లేదా అమ్మా" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. మహేష్ సెటైరికల్ జోక్ కి సంబంధించిన ఈ వీడియో ఇప్పుడు నెట్టింట సందడి చేస్తోంది.

సూపర్ స్టార్ మహేష్ బాబు తన సినిమాల్లో ఎంత కామెడీ చేస్తారో, రియల్ లైఫ్ లోనూ అంతే సరదాగా ఉంటారు. సెట్స్ లో ఎప్పుడూ జోకులు వేస్తూ అందరినీ నవ్విస్తుంటారు. మహేష్ కామెడీ టైమింగ్ మామూలుగా ఉండదని ఆయనతో కలిసి వర్క్ చేసిన నటీనటులు, దర్శకులు చెబుతుంటారు. ఇంటర్వ్యూలో ఆయన వేసే పంచులు, కౌంటర్లు నవ్వులు పూయిస్తుంటాయి. అలానే ఇప్పుడు ఎయిర్ పోర్టులో ఫోటోగ్రాఫర్స్ తో ఫన్నీగా మాట్లాడిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేష్ బాబు ప్రస్తుతం 'వారణాసి' సినిమా చేస్తున్నారనే సంగతి తెలిసిందే. ఇటీవలే షూటింగ్ కి కాస్త బ్రేక్ ఇచ్చి, విదేశాలకు వెళ్లారు. జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతానికి వెళ్లి ట్రెక్కింగ్, ట్రైనింగ్ తీసుకున్నారు. ఈ విషయాన్ని మహేష్ స్వయంగా ఇన్స్టాగ్రామ్ లో వెల్లడించారు. అయితే మహేష్ తన హాలిడే ముగించుకొని, ఆదివారం తిరిగి హైదరాబాద్ లో ల్యాండ్ అయ్యారు. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుంచి మహేష్ బయటకు వస్తున్న వీడియోలు, ఫోటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

మహేష్ బాబు ఎయిర్ పోర్టు నుంచి వస్తున్న సమయంలో, ఆయన్ను ఫోటోలు తీయడానికి కెమెరామెన్లు ఎగబడ్డారు. ఈ సందర్భంగా "సండే కూడా హాలిడే లేదా అమ్మా" అంటూ మహేష్ తన కామెడీ టైమింగ్ తో అలరించారు. ఇది చూసిన సూపర్ స్టార్ అభిమానులు.. బాబుతో కామెంట్లు చేస్తున్నారు.

# సీఎం ఛైర్‌లో కూర్చున్న విజయ్.. 'జన నాయగన్' విడుదలపై నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు



దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో, ఆయన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదలపై చర్చ మొదలైంది. ఈ చిత్రం సంక్రాంతికే రావాల్సి ఉన్నా సెన్సార్ బోర్డు అభ్యంతరాల వల్ల నిలిచిపోయింది. తాజాగా నిర్మాత కేవీఎన్ మాట్లాడుతూ.. విజయ్ ఇప్పుడు వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ 'జన నాయగన్' అయ్యారని, సెన్సార్ సర్టిఫికెట్ రాగానే సినిమాను విడుదల చేస్తామని వెల్లడించారు.దళపతి విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. గత నాలుగైదు రోజులుగా పొలిటికల్ థ్రిల్లర్ ను తలపించేలా సాగిన ఉత్కంఠకు తెర దించుతూ, రాష్ట్రంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు కొత్త సీఎంకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో విజయ్ చివరి సినిమా ' జన నాయగన్ ' గురించి చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాత వెంకట్ కె.నారాయణ సినిమా విడుదలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.విజయ్ హీరోగా హెచ్.

వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'జన నాయగన్'. ఇది తన కెరీర్ లో ఆఖరి చిత్రమని దళపతి ఎన్నికలకు ముందే ప్రకటించారు. అందుకే అభిమానులు ఆయనకు బ్లాక్ బస్టర్ హిట్టు ఇవ్వాలని చూశారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ సెన్సార్ బోర్డు సినిమా విడుదలను అడ్డుకుంది. అయితే ఇప్పుడు తమిళనాట విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో, 'జన నాయగన్' రిలీజుకు మార్గంవినిపిస్తోంది.

# 'పవన్ కల్యాణ్ పేరు వెనుక ఓ కథ ఉంది.. భార్య ముందు బలాదూర్ అని చెప్పే ప్రయత్నమే పురుష



వీరు ఉలవల పవన్ కళ్యాణ్ హీరోగా డెబ్యూ ఇస్తున్న చిత్రం పురుష: (గ్రాబతీబంష్ట్రుష్ట్రు). ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనుక ఓ ఆడది ఉంటుంది. స్వేచ్ఛ కోసం భర్త చేసే అలు పెరుగని పోరాటం.. అంటూ సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ మూవీలో సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు.ఫ్యామిలీ కామెడీ ఎంటం టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రాన్ని మే 22న గ్రాండ్‌గా విడుదలచేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి సినిమా విశేషాలు పంచుకున్నారు. పాపులర్ యాక్టర్ సప్తగిరి మాట్లాడుతూ.. ఈ అబ్బాయి పవన్ కళ్యాణ్ అనే పేరు పెట్టుకున్నాడు. దాని వెనుక ఒక కథ కూడా ఉంది. వీళ్ల నాన్న పవన్‌కల్యాణ్‌కు పెద్ద అభిమాని. తమ్ముడు సినిమా చూసిన తర్వాత ఈయన పుట్టాడు కాబట్టి.. పవన్‌కల్యాణ్ అభిమాని కాబట్టివాళ్లు నాన్న ఈ అబ్బాయికి పవన్‌కల్యాణ్ అనే పేరు పెట్టారన్నాడు. థియేటర్లకు జనాలు రావడమే కష్టమైన ఈ రోజుల్లో వాళ్ల అబ్బాయి మీద ప్రేమతో భారీ బడ్జెట్ పెట్టి మా అబ్బాయినిస్క్రీన్‌పై నేను హీరోగా చూడాలని ఎంతో ఇష్టపడి ఆయన కష్టపడి సంపాదించిన డబ్బును ఈ సినిమా కోసం పెట్టారు. ఈ పవన్ కల్యాణ్‌కు మంచి భవిష్యత్ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నాడు .ఉప్పుకర్పూరంబు నొక్క పోలిక నుండు.. చూడ చూడ రుచుల జాడవేరు.. పురుషులందు పుణ్య పురుషులు వేరయా.. విశ్వదాభిరామ వినుర వేమ అనే పద్యాన్ని చెప్పిన సప్తగిరి.. పురుషులందు పుణ్య పురుషులైనా. మహాబలులైనా. ధైర్యవంతులైనా.. గండరగండులైనా.. ఎలాంటి వారైనా సరే భార్య ముందు బలాదూర్ అని చెప్పే ప్రయత్నమే ఈ సినిమా అన్నాడు. ఈ రోజుల్లో సినిమా రావాలంటే ఆ డైరెక్టర్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ చేశాడని డైరెక్టర్‌కు పేరొస్తేనే జనాలు లోపలికి వస్తున్నారు. ఆ స్థితిలో ఉన్నాం కాబట్టి ఈ సినిమా మొత్తం మా వీరు ఉలవలపై ఆధారపడి ఉంది. ఆయన తప్పకుండా తన మార్క్‌ను చూపించే ప్రయత్నం చేశారు. మేం మొన్ననే సినిమా చూశామన్నాడు సప్తగిరి.


పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ మూవీ మొదలైనప్పుడు సప్తగిరి అన్నను, కసిరెడ్డి అన్నను లేదా బయట ఏదైనా సందర్భంలో ఎవరైనా సెలబ్రిటీని చూసినప్పుడు లైవ్‌లో చూశామన్నా ఫీలింగ్ వచ్చేది.

# వ్యాఖ్యాతగా మారిన శిల్పా శెట్టి.. జీ5లో వస్తున్న 'మా హై నా'!




బాలీవుడ్ నటి శిల్పా శెట్టి కుంద్రా వ్యాఖ్యాతగా 'మా హై నా' అనే సరికొత్త హిందీ కామెడీ కుకింగ్ షో త్వరలో ప్రారంభం కాబోతుంది. ఈ మేరకు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఆదివారం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మొత్తం పది ఎపిసోడ్ల పాటు సాగే ఈ సిరీస్‌లో ఆరుగురు సినీ సెలబ్రిటీలు తమ తల్లులతో కలిసి పాల్గొనబోతున్నారు. లిల్ ఫ్రోడో ప్రొడక్షన్స్ హౌస్ నిర్మిస్తున్న ఈ షోలో నేటి తరం యువత జీవనశైలికి మరియు తల్లుల సాంప్రదాయ ఆలోచనలకు మధ్య ఉన్న అనుబంధాన్ని వంటగది వేదికగా ఆసక్తికరంగా చూపించనున్నారు.ఈ కార్యక్రమంలో సునీతా అహుజా–టీనా అహుజా, ఊర్వశి ధోలాకియా–క్షితిజ్ ధోలాకియా, తాన్య మిట్టల్–సునీతా మిట్టల్, గుల్లు–మునేష్ తన్వర్, షాహిదా అన్సారీ–అఫ్షాన్, మరియు భాగ్యశ్రీ శర్మ–రింజు శర్మలు జంటలుగా సందడి చేయబోతున్నట్లు తెలుస్తుంది. వంటలు చేస్తూనే ఒకరికొకరు ఎదురయ్యే భావోద్వేగాలు, చిన్నపాటి గొడవలు మరియు జ్ఞాపకాలను ఈ షో కళ్లకు కట్టనుంది. యువతకు మరియు వారి తల్లులకు మధ్య ఉండే ప్రత్యేక బంధాన్ని సరికొత్త కోణంలో చూపించడమే ఈ షో ఉద్దేశమని జీ5 హిందీ బిజినెస్ హెడ్ కావేరి దాస్ తెలిపారు.

# హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్.. హాట్ టాపిక్‌గా కృతిసనన్ కామెంట్స్



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసాగుతుంది.ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యునరేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది.కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది.

# డిప్రెషన్ వల్ల లాభాలు కూడా ఉన్నాయా?.. అయితే పూరీ జగన్నాథ్ చెప్పే ఈ మాటలు వినాల్సిందే!



డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తన 'పూరీ మ్యూజింగ్స్' పాడ్‌కాస్ట్‌లో భాగంగా 'డిప్రెషన్' (మానసిక కుంగుబాటు) గురించి సరికొత్త కోణంలో విశ్లేషించారు. సాధారణంగా నెగెటివ్ అనిపించే ఈ స్థితిలో కూడా మనిషి తనను తాను నిర్మించుకోవడానికి కొన్ని అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. డిప్రెషన్ అనేది కేవలం బాధ మాత్రమే కాదని, అది మనల్ని మనం నిజాయితీగా సమీక్షించుకోవడానికి లభించే విరామం వంటిదని పూరీ పేర్కొన్నారు. ఒంటరితనం మనలో అనలిటికల్ థింకింగ్, ఎంపతీని పెంచుతుందని చెప్పారు. ఇంకా ఆయన ఏం చెప్పారంటే...సాధారణంగా నెగెటివ్ గా భావించే డిప్రెషన్ వల్ల కూడా కొన్ని బెనిఫిట్స్ ఉన్నాయని చెబుతున్నారు దర్శకుడు పూరీ జగన్నాథ్ . తన 'పూరీ మ్యూజింగ్స్' పాడ్ కాస్ట్ లో తాజాగా 'డిప్రెషన్' గురించి ఆయన మాట్లాడారు. వేగంగా సాగే జీవితంలో ఒంటరితనం మనల్ని మనం నిజాయితీగా విశ్లేషించుకోవడానికి, మన తప్పులను సరిదిద్దుకోవడానికి ఒక అవకాశాన్ని ఇస్తుందని పూరీ పేర్కొన్నారు. తీవ్రమైన మానసిక కుంగుబాటు హానికరమే అయినప్పటికీ, దానిని ఒక ప్రయోజనకరమైన సంకేతంగా వాడుకోవచ్చని తెలిపారు. ఆ విధంగా డిప్రెషన్ నుంచి గొప్ప విజయాలు సాధించిన అబ్రహం లింకన్, లేడీ గాగా లాంటి ప్రముఖులను ఉదాహరణగా చెప్పారు. బాధ శాశ్వతం కాదని, చీకటి తర్వాత వెలుగు కచ్చితంగా వస్తుందని పూరీ అన్నారు."డిప్రెషన్ మంచిది కాదని మనందరికీ తెలుసు. అయినా ఏదో సమయంలో అందరం డిప్రెషన్ కి గురవుతాం. అయితే ఒక్కోసారి ఇలా డిప్రెస్ అయి కూర్చోవడం వలన, ఇండైరెక్ట్ గా కొన్ని బెనిఫిట్స్ ఉన్నాయి. డిప్రెషన్ వల్ల మనం స్లో డౌన్ అయిపోతాం. ఈ ఫాస్ట్ పేస్డ్ లైఫ్ లో ఇలాంటి పాజ్ మనకి అవసరం కూడా. ఫ్రెండ్స్‌ని కలవడం మానేస్తావ్. మూడ్ ఆఫ్ అయి ఒంటరిగా కూర్చుంటావ్. నిరాశ మిమ్మల్ని గాఢమైన ఆలోచనల్లోకి నెట్టివేస్తుంది. మీ అలవాట్ల గురించి, మీ సంబంధాల గురించి, మీరు వెళ్తున్న దారి గురించి.. మిమ్మల్ని మీరే ప్రశ్నించుకుంటారు. చాలా నిజాయితీగా మిమ్మల్ని మీరు విశ్లేషించుకుంటారు. మీలో అనలిటికల్ థింకింగ్ పెరుగుతుంది"

"మిగతా వాళ్ళతో పాటు మీరు చేస్తున్న తప్పులు కూడా మీకు అర్థం అవుతాయి. ఎవరికో మీరు చెప్పిన సమాధానాలు మంచిగా లేవని మీకు అర్థం అవుతుంది. లేదా కొంతమందితో అలా ప్రవర్తించకుండా ఉండాల్సింది అని మీరు ఫీల్ అవుతారు. మీరు ఎందుకు వెనకపడ్డారు.. ఎక్కడ దారి తప్పుతున్నారో తెలుసుకుంటారు. ఇంతకుముందు మీరు సీరియస్ గా తీసుకున్న విషయాలు, సిల్లీ థింగ్స్ అని అర్థమవుతుంది. డిప్రెషన్ కి గురైనవాళ్ళు బాధను చాలా బాగా అర్థం చేసుకుంటారు. మిగతా వాళ్ళ పెయిన్ కూడా ఇంతకు ముందు కంటే బాగా అర్థం చేసుకుంటారు. దానివల్ల మీరు లెస్ జడ్జిమెంటల్ గా తయారవుతారు. మీలో ఎంపతీ పెరుగుతుంది. మీ రిలేషన్స్ బెటర్ అవుతాయి. మీరు ఒక ఆర్టిస్ట్ గాని, రైటర్ గాని, మ్యూజిషియన్ అయితే.. డిప్రెషన్ తర్వాత మీ నుండి వచ్చే వర్క్ చాలా మీనింగ్ ఫుల్ గా ఉంటుంది"

# ఏంటి భయ్యా.. 'పెద్ది' టికెట్ ధర 40 డాలర్లా.. ఇదేమన్నా 'బాహుబలి', 'వారణాసి' అనుకుంటున్నారా?

రామ్ చరణ్ నటించిన 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల కానుంది. అయితే అమెరికాలో ఈ మూవీ ప్రీమియర్ టికెట్ ధరలు వి38 నుండి వి42 వరకు ఉండటంపై ఓ సినీ ప్రేమికుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇది 'బాహుబలి', 'వారణాసి' లేదా 'ఆర్ఆర్ఆర్' అంతటి భారీ సినిమా కాకపోయినా ఇంత రేటు పెట్టడం దోపిడీయేనని విమర్శించాడు. మరోవైపు టికెట్ రెట్లపై యూఎస్ డిస్ట్రిబ్యూటర్లు స్పందిస్తూ.. స్పెషల్ ఫార్మాట్స్ వల్లే ధరలు ఎక్కువగా ఉన్నాయని వివరణ ఇచ్చారు.

ఏంటి భయ్యా.. 'పెద్ది' టికెట్ 40 డాలర్లా?.. ఇదేమన్నా ===, 'బాహుబలి', 'వారణాసి' అనుకుంటున్నారా?.. యూఎస్ ఆడియన్ ఆవేదన!(ఫోటోలు– ఝుఝుఝుఎ ఎవశ్రీబస్త్రబ)




రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా మరో మూడు వారాల్లో ప్రేక్షకుల ముందుకి రానుంది. జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. యూఎస్ఏలో ఒకరోజు ముందుగానే థియేటర్లలోకి రాబోతోంది. జూన్ 3న ప్రీమియర్లు పడబోతున్నాయి. ఇప్పటికే ఓవర్ సీస్ లో అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. అయితే యూఎస్ఏలో 'పెద్ది' టికెట్ రేట్లు మరీ ఎక్కువగా ఉన్నాయని ఓ సినీ ప్రియుడు ఆవేదన వ్యక్తం చేస్తున్న ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.'పెద్ది' చిత్రాన్ని ప్రత్యంగిర సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఓవర్ సీస్ లో రిలీజ్ చేస్తోంది. నార్త్ అమెరికాలో టికెట్ బుకింగ్స్ తెరుచుకున్న కొన్ని గంటల్లోనే ప్రీసేల్స్ లక్ష డాలర్ల మార్క్ దాటేసింది. ఇది తెలుగు సినిమాల్లో ఆల్ టైమ్ రికార్డ్. ఇప్పటికే ఉత్తర అమెరికా ప్రీమియర్లకు 5000ం టికెట్లు అమ్ముడయ్యాయని, ఇంకా పెరుగుతూనే ఉన్నాయని చిత్ర బృందం అఫీషియల్ పోస్ట్ పెట్టింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని పేర్కొంది. అయితే యూఎస్ఏలో ప్రీమియర్ల టికెట్ ధర వి38 పెట్టినట్లు తెలుస్తోంది. ట్యాక్స్ కలుపుకొని 40 డాలర్లు దాటుతోందని యూఎస్ మూవీ లవర్ ఒకరు వీడియో పోస్ట్ చేశాడు. అంత రేటు పెట్టడానికి ఇదేమన్నా ===, 'బాహుబలి' మూవీనా? లేదా 'వారణాసి' సినిమానా? అని ప్రశ్నించాడు.

# 'మనీ హైస్ట్' ఫ్రాంఛైజీ నుంచి మరో క్రేజీ సిరీస్.. అనౌన్స్‌మెంట్ టీజర్ విడుదల!




ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్పెయిన్ సిరీస్ 'మనీ హైస్ట్' (లా కాసా డి పాపెల్) అభిమానులకు నెట్‌ఫ్లిక్స్ తీపి కబురు అందించింది. 2021లో ఐదు సీజన్లతో ఈ ఒరిజినల్ సిరీస్ ముగిసినప్పటికీ, ఈ ఫ్రాంఛైజీని మరింత విస్తరించనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సిరీస్‌కి సంబంధించిన కొత్త టీజర్‌ను విడుదల చేసింది. మనీ హైస్ట్ ప్రపంచం కొనసాగబోతుంది అనే పేరుతో విడుదలైన కొత్త టీజర్ మరింత రసవత్తరంగా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సిరీస్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించబోతున్నట్లు తెలిపింది.